FLASH INDIA NEWS
www.flashindianews.com
# ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను
18సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..
★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★
సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 185 | ఆదివారం 30.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## మీ పట్టుదల అందరికీ గర్వకారణం



### యువత క్రీడల వైపు మరింతగా అడుగులు వేయాలి..

- మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళులు
- క్రీడల్లో యువత మరింతగా పాల్గొనాలి..
- అంకితభావం, పట్టుదలతో విజయాలు సాధించాలి
- క్రీడలు గెలుపు కోసం మాత్రమే కాదు..
- కలలు కనడం, కష్టపడటం నేర్పిస్తాయన్న శిఖర్ ధావన్
- దేశానికి పేరు తెచ్చిన క్రీడాకారులకు ప్రత్యేక కార్యక్రమాలు..
- పలు క్రీడల్లో పోటీలు, విజేతలకు బహుమతులు
- మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడలకు ప్రోత్సాహం..

02


## గడువు పెంచండి..

**అర్హుల ఓట్లు తొలగొద్దు.. అనర్హులకు చోటివ్వొద్దు**

### ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ

92.86 లక్షల మంది ఓటర్లపై పరిశీలన అవసరం..

గ్రామసభలు, వార్డు సమావేశాల్లో ముసాయిదా జాబితాల పరిశీలన



- ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ
- ఓటర్ల అభ్యంతరాలకు మరింత సమయం ఇవ్వాలి..
- సవరణ గడువు మరో నాలుగు వారాలు పొడిగించాలని విజ్ఞప్తి
- తొలగింపులపై ఓటర్లకు ముందస్తు నోటీసులు ఇవ్వాలి..
- సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ప్రక్రియ ఉండాలన్న సీఎం
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌పై ప్రత్యేక దృష్టి..
- పట్టణ ఓటర్లకు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచన
- 92.86 లక్షల మంది ఓటర్లపై పరిశీలన అవసరం..
- ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి..

03

### ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక పోర్టల్


ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను స్పీడప్ చేయండి..

02













## భయం భయంగా!

### హిమాలయాల్లో హాహాకారం.. నేపాల్ అతలాకుతలం



వరదలో సర్వం కోల్పోయాం.. నేపాల్ వాసుల కన్నీరు మున్నీరు

- వరద బీభత్సంతో దెబ్బతిన్న రసువా సహా పలు జిల్లాలు..
- గ్రామాలు, ఇళ్లు, రహదారులు, వంతెనలకు తీవ్ర నష్టం గల్లంతైన వారి కోసం ముమ్మరంగా గాలింపు..
- సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలతో సహాయక చర్యలు
- టన్నెల్స్‌లో చిక్కుకున్న కార్మికుల కోసం ప్రత్యేక రెస్క్యూ..
- మృతదేహాల గుర్తింపులో డీఎన్ఏ పరీక్షలకు ప్రాధాన్యం..
- విదేశీయులు, యాత్రికుల వివరాల సేకరణకు ప్రత్యేక చర్యలు

02



నేపాల్‌లోని రసువా జిల్లా సమీపంలో హిమనదం కూలిపోవడంతో భోటేకోషి, త్రిశూలీ నదుల్లో భారీ ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ విపత్తులో వందలాది మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతయ్యారు. గ్రామాలు, ఇళ్లు, వంతెనలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు గల్లంతైన వారి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగి-స్తున్నాయి. టన్నెల్స్‌లో చిక్కుకున్న కార్మికుల రక్షణతో పాటు మృతదేహాల గుర్తింపుకు డీఎన్ఏ పరీక్షలు, ఫోరెన్సిక్ సాంకేతికతను వినియోగిస్తున్నారు. ప్రతికూల వాతావరణం, కొండచరియలు, దెబ్బతిన్న రహదారులు సహాయక చర్యలకు ఆటంకంగా మారాయి. మరోసారి వరదలు సంభవించే ప్రమాదం ఉండటంతో దిగువ ప్రాంతాలను అప్రమత్తం చేశారు. విపత్తు తీవ్రత నేపథ్యంలో భారత్, చైనా సహా పలు దేశాలు మానవతా, సాంకేతిక సహాయాన్ని అందిస్తున్నాయి. హిమాలయాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, హిమనదాల అస్థిరతపై ఈ ఘటన మరోసారి ఆందోళనను పెంచింది.



### ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగలేరా?..


కార్యక్రమం మధ్యలో అలిగి వెళ్లిపోయిన ఎమ్మెల్యే దానం నాగేందర్

- ఎమ్మెల్యే వచ్చేలోపే లక్కీ డ్రా నిర్వహణ..
- మధ్యలోనే కార్యక్రమం నుంచి వెళ్లిపోయిన దానం నాగేందర్
- ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికపై వివాదం..
- ఇల్లు రాని వారంతా తనను కలవాలని ఎమ్మెల్యే హామీ

05

## పిల్లలు భారం కాదు..

### సంజీవని గేమ్ చేంజర్‌గా మారుతుంది




మూడు నెలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి
అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు
ఏజెన్సీలో సెల్‌టవర్లు.. కనెక్టివిటీ పెంపు

'నీకు నీట్ కోసం తెలుసా అమ్మా.. అని సీఎం ఓ తల్లిని అడగ్గా డాక్టర్ కోర్స్ తెలుసు సార్' అని సమాధానం ఇచ్చింది. ఇంకా మిగిలిన మహిళలతో సీఎం మాట్లాడారు. పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు.. ఏం చేయబోతున్నారని కుశల ప్రశ్నలు వేశారు.

- మారుమూల గిరిజన ప్రాంతాల్లోనూ నాణ్యమైన వైద్యం
- సంజీవని ద్వారా ప్రతి కుటుంబానికీ ఆరోగ్య సేవలు
- డ్రోన్ల ద్వారా రక్త నమూనాల తరలింపు..
- ఏజెన్సీ ప్రాంతాలకు వేగవంతమైన వైద్య సేవలు
- గర్భిణులకు తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్‌తో వైద్య సేవలు..
- 104 వాహనాలతో మొబైల్ మెడికల్ సేవలు
- కొండ ఎంత దూరంలో ఉన్నా.. వైద్యం ప్రజల దగ్గరకే
- ప్రతి గిరిజన బిడ్డ ఆరోగ్యంగా ఎదగాలి
- రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్..

03

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు..



- ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు
- 27 మంది మృతి.. 50 భవనాలు ధ్వంసం
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

02

## మళ్లీ వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

### తలక్రిందులుగా తపస్సు చేసినా..



రైతులపై బీఆర్ఎస్‌ది మొసలి కన్నీరు..
పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

- భూ సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తోందన్న మంత్రి
- పేదలకు ఇళ్లు ఇస్తుంటే బీఆర్ఎస్ నేతలకు కడుపుమంట..
- ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని పొంగులేటి ఆగ్రహం
- సుమారు 3 వేల ఎకరాల భూముల పట్టాల పంపిణీ..
- పేద రైతులకు భూ హక్కులు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం

02

### దివ్యాంగులపై దయ లేని ప్రభుత్వం

- కేసీఆర్ హయాంలో దివ్యాంగులకు ప్రాధాన్యం..
- పింఛన్‌తో పాటు విద్య, ఉద్యోగాలు, ఇళ్లలో రిజర్వేషన్లు కల్పించామని వెల్లడి
- 'చంద్రబాబు ఆదర్శమంటావ్.. మరి ఎప్పుడు పెంచుతావ్?'
- రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన హరీశ్‌రావు
- దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి..

03



### పాలిటెక్నిక్‌పై పునరాలోచించాలి..

- పాలిటెక్నిక్ విద్యను ఇంజినీరింగ్‌లోనే కొనసాగించాలి..
- లేబర్ శాఖకు తరలించొద్దని ఎమ్మెల్యే స్పష్టం
- జీవో 97ను వెంటనే రద్దు చేయాలి..
- విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలని కడియం శ్రీహరి విజ్ఞప్తి
- స్కిల్స్‌తో పాలిటెక్నిక్ విద్యార్థులకు మెరుగైన ఉద్యోగాలు..

02



# భయం భయంగా!

**ఖాట్మండు :** నేపాల్ చైనా సరిహద్దు ప్రాంతంలో హిమాలయాల్లోని భారీ హిమనదం (గ్లేసియర్) కుప్పకూలడంతో సంభవించిన భయంకర ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) దేశ చరిత్రలోనే అత్యంత విషాదకర ప్రకృతి విపత్తుల్లో ఒకటిగా నిలిచాయి. తాజా అధికారిక సమాచారం ప్రకారం ఈ విపత్తులో 626 మంది ప్రాణాలు కోల్పోగా, 2,400 మందికిపైగా గల్లంతయ్యారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నాలుగో రోజుకు చేరిన సహాయక చర్యలకు నిరంతర వర్షాలు, కొండచరియలు, దెబ్బతిన్న రహదారులు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి. నేపాల్లోని రసువా జిల్లాకు సమీపంలో, చైనా (టిబెట్) సరిహద్దు వద్ద ఉన్న హిమనదంలోని దిగువ భాగం ఒక్కసారిగా విరిగి లోయలో పడిపోయింది. దీనివల్ల మంచు, రాళ్లు, మట్టి భారీ వేగంతో కిందకు దూసుకెళ్లి నదీ ప్రవాహాన్ని ఒక్క సారిగా ఉద్ధృతం చేశాయి. క్షణాల్లోనే భోటెకోషి, త్రిశూలీ నదులు ఉప్పొంగి భారీ వరదలుగా మారి మార్గమధ్యంలోని గ్రామాలు, వంతెనలు, రహదా రులు, జలవిద్యుత్ ప్రాజెక్టులను ముంచెత్తాయి. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణ కూడా ఈ విపత్తుకు హిమనదం కూలిపోవడమే ప్రధాన కారణమని సూచిస్తోంది.

### గ్రామాలు నేలమట్టం.. భారీ ఆస్తి నష్టం

వరదల దాటికి అనేక గ్రామాలు పూర్తిగా ధ్వంసమ య్యాయి. వందలాది ఇళ్లు కొట్టుకుపోగా, వంతెనలు, రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతి న్నాయి. నేపాలు చైనాతో అనుసంధానించే కీలక సరిహద్దు మార్గాలు తెగిపోవడంతో రవాణా వ్యవస్థస్తంభించింది. అనేక ప్రాంతాలు దేశంలోని మిగతా ప్రాంతాలతో సంబంధాలు కోల్పోయాయి.

### వేలాది మంది కోసం గాలింపు

నేపాల్ సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొన సాగిస్తున్నాయి. అయితే ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ల వినియోగం పలుమార్లు నిలిపివేయాల్సి వచ్చింది. మట్టితో నిండిపోయిన సొరంగాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రత్యేక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. గల్లంతైన వారిలో జలవిద్యుత్ ప్రాజెక్టుల కార్మికులు, విదేశీయులు, యాత్రికులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### మరోసారి వరదల ముప్పు

హిమనదం కూలిన ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన సరస్సులు నిండిపోతుండటంతో మరోసారి వరదలు సంభవించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిం చారు. భోటెకోషి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు.

### సాంకేతిక సహాయంపై నేపాల్ విజ్ఞప్తి

భారత్, చైనా, అమెరికా సహా పలు దేశాలు సహాయాన్ని ప్రకటించాయి. అయితే సాధారణ శోధన రక్షణ బృందాల కంటే డీఎన్ఏ గుర్తింపు, మృతదేహాల సంరక్షణ, సొరంగాల్లో రక్షణ చర్యలు, తాత్కాలిక వంతెనల ఏర్పాటు వంటి ప్రత్యేక సాంకేతిక సహాయం అవసరమని నేపాల్ ప్రభుత్వం వెల్లడించింది. దీర్ఘకాల పునరావాసం, పునర్నిర్మాణానికి కూడా అంతర్జాతీయ సహకారం కోరుతోంది.

### వాతావరణ మార్పులపై ఆందోళన

హిమాలయ ప్రాంతంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా హిమనదాలు అస్థిరంగా మారుతున్నా యని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇటీవలి సంవత్స రాల్లో హిమనదాల కరుగుదల వేగవంతమవడం, కొత్త హిమసరస్సులు ఏర్పడడం వల్ల ఇలాంటి ఆకస్మిక వరదల ప్రమాదం పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విపత్తు హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావంపై మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

### ముమ్మరంగా సహాయక చర్యలు..

ఇంకా వందల మంది ఆచూకీ గల్లంతు నేపాల్లోని రసువా జిల్లా లో ప్రారంభమైన విపత్తు భోటెకోషి, త్రిశూలీ నదుల వెంట ఉన్న అనేక జిల్లాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. వరదల ధాటికి గ్రామాలు, ఇళ్లు, వంతెనలు, రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. అనేక ప్రాంతాలు దేశంలోని మిగతా ప్రాంతాలతో పూర్తిగా సంబంధాలు కోల్పోయాయి. పోలీసు ల తాజా వివరాల ప్రకారం చిత్వన్, నవల్పరాసి ఈస్ట్, గోర్ఖా, ధాదింగ్, నువాకోట్, తనహున్, రసువా తదితర జిల్లాల్లో ఇప్పటివరకు 626 మృతదేహాలను గుర్తించి వెలికితీశారు. వేలాది మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటుండగా, రహదారులపై పేరుకుపోయిన మట్టి, మట్టి, కొండచరి కొండ యలు, నిరంతర వర్షాలు సహాయక చర్యలకు అడ్డంకిగా మారుతున్నాయి. గల్లంతైన వారి కోసం సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు హెలికాప్టర్లు, డ్రోన్లు, ప్రత్యేక పరికరాలతో గాలింపు కొనసాగిస్తున్నాయి.

### భారత్ మానవతా సాయం..

ఇదిలా ఉండగా, నేపాల్కు భారత్ మానవతా సహాయాన్ని అందిస్తోంది. సహాయక బృందాలు, వైద్య సిబ్బంది, అత్యవసర ఔషధాలు, ఇతర సహాయక సామగ్రితో కూడిన ప్రత్యేక బృందాలను భారత్ పంపింది. అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. మరోవైపు, చైనా వైపు హిమాలయ ప్రాంతంలో ఏర్పడిన తాత్కాలిక సరస్సు పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మరోసారి భారీగా నీరు విడుదలయ్యే అవకాశం ఉండటంతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేపాల్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. దీంతో సహాయక బృందాలు అప్రమ త్తంగా పనిచేస్తున్నాయి.

### పెరుగుతున్న మృతుల సంఖ్య

నేపాల్లో భోటేకోషి ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య 626కు చేరింది. మరో 2,426 మంది ఇంకా గల్లంతై నట్లు జాతీయ విపత్తు ప్రమాద నివారణ, నిర్వహణ సంస్థ శనివారం వెల్లడించింది. వరదల అనంతరం నేపాల్ ప్రభుత్వం భారీ సాయిలో సహాయక చర్యలు చేపట్టింది. ఇప్ప టివరకు 4,400 మందికీ పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికా రులు తెలిపారు. వేలాది మంది సైన్యం, పోలీసులు, సాయుధ పోలీసు బలగాల సిబ్బంది గాలింపు, సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రహదారులు, కొండచరియలు సహాయక చర్యలకు ఆటంకంగా మారుతున్నాయి.

### ఆదుకోండి ప్లీజ్!

నేపాల్లో సంభవించిన భీకర వరద విపత్తు తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. తొలుత విదేశీ సహా యాన్ని పరిమితం చేసిన నేపాల్ ప్రభుత్వం తాజాగా కీలక రంగాల్లో అంతర్జాతీయ నిపుణుల సేవలను స్వీకరించేందుకు అంగీకరించింది. భారత్, చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా నుంచి ప్రత్యేక నిపుణులు రంగంలోకి దిగనున్నారు. సొరంగాల్లో చిక్కుకున్న వారి రక్షణ, మృతదేహాల గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు,ఫోరెన్సిక్ పరిశీలనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నేపాల్ను కుదిపేసిన భీకర ఆకస్మిక వరదల విపత్తు మరింత విషాదకరంగా మారుతోంది. భోటెకోషి, త్రిశూలి నదీ పరివాహక ప్రాంతాల్లో సంభవించిన ఉద్ధృత పరదలతో వందలాది మంది ప్రాణాలు కోల్పోగా, వేల సంఖ్యలో ప్రజల ఆచూకీ ఇంకా తెలియరావడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఈ విపత్తులో 720 మందికి పైగా మృతి చెందినట్లు అధికారికంగా నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది. సుమారు 2450 మంది జాడ తెలీయడం లేదని ప్రకటించింది. ఇక విద్యుత్ ప్రాజెక్ట్ ల కోసం రెండు ప్రాంతాలలోని రెండు టన్నెల్ లో పని చేస్తున్న కార్మికులలో అధిక సంఖ్యలో కొట్టుకుపోయారు. ఈ రెండు టన్నెల్ లో కలసి మొత్తం 924 మంది కార్మికులు విపత్తు సమయంలో విధులలో ఉన్నారు. బురద, నీటిలో చిక్కుకుపో యిన 215 కార్మికులను ఇప్పటి వరకు రక్షించారు.. మిగిలిన వారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు నేపాల్ రెస్క్యూ టీమ్స్ 24 గంటలు కృషి చేస్తున్నాయి.

### టన్నెల్ రెస్క్యూపై ప్రత్యేక దృష్టి

వరద ఉద్ధృతికి పలు ప్రాంతాల్లో సొరంగాలు, నిర్మాణాల శిథిలాలు, కొండచరియల కింద పలువురు చిక్కుకుని ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అత్యా ధునిక టన్నెల్ రెస్క్యూ సాంకేతిక పరిజ్ఞానం అవసరమైంది. ఈ నేపథ్యంలో భారత్ సహా ఇతర దేశాల నుంచి ప్రత్యేక నిపుణుల సహాయాన్ని నేపాల్ కోరింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించడం, సొరంగాల్లోకి ప్రత్యేక పరికరాలతో చేరుకోవడం, ప్రమాదకర ప్రాంతాల్లో సురక్షితంగా సహాయక చర్యలు చేపట్టడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సాధారణ రెస్క్యూ కార్యకలాపాలను నేపాల్ భద్రతా బలగాలే నిర్వహిస్తుండగా... అత్యంత క్లిష్టమైన సాంకేతిక కార్యకలాపాల్లో విదేశీ నిపుణులను వినియోగించనున్నారు.

### డీఎన్ఏ పరీక్షలకు ప్రాధాన్యం

వరదల్లో కొట్టుకుపోయిన వారి మృతదేహాలను గుర్తించడం కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారింది. అనేక మృతదేహాలు తీవ్రంగా దెబ్బతినడంతో సాధారణ పద్ధతుల్లో గుర్తింపు సాధ్యం కావడం లేదు. దీంతో డీఎన్ఏ పరీక్షలు, ఫోరెన్సిక్ విశ్లేషణలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. విదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు, కైలాస మానసరోవర యాత్రికులు కూడా పెద్ద సంఖ్యలో గల్లంతైన నేపథ్యంలో మృతదేహాల గుర్తింపు ప్రక్రియ అత్యంత కీలకంగా మారింది. వివిధ దేశాల పౌరులు గల్లంతవడంతో అంతర్జాతీయ స్థాయిలో సమన్వయంతో డీఎన్ఏ నమూనాల సేకరణ, ఫోరెన్సిక్ పరీక్షలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### రోజురోజుకూ పెరుగుతున్న మృతుల సంఖ్య

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయకబృందాలు ముందుకు సాగుతున్న కొద్ది మృతదేహాలు బయటపడుతున్నాయి. అధికారిక లెక్కలు నిరంతరం మారుతుండగా, మృతుల సంఖ్య ఇప్పటికే వందల సంఖ్యను దాటింది. వేల మందికి పైగా గల్లంతైనట్లు వివిధ నివేదికలు చెబుతున్నాయి. ఆచూకీ లభించని వారిలో నేపాల్ పౌరులతో పాటు భారత్ సహా అనేక దేశాలకు చెందిన పర్యాటకులు ఉన్నారు. ఆగస్టు 28 నాటికి నేపాల్ విదేశాంగ శాఖ వెల్లడిం చిన వివరాల ప్రకారం వందలాది మృతదేహాలను వెలికితీయగా, అనేక మంది స్థానికులు, విదేశీయులు ఇంకా గల్లంతయ్యారు. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ ప్రాణనష్టం మరింత పెరిగే అవకాశం ఉందన్న భయాలు వ్యక్తమవుతున్నాయి..

### భారత్ నుంచి కీలక సహకారం

పొరుగు దేశమైన నేపాల్కు భారత్ ఇప్పటికే మానవతా సహాయాన్ని అందిస్తోంది. సహాయక సామగ్రి, వైద్య సహాయం, ప్రత్యేక సాంకేతిక నిపుణుల సేవలకు భారత్ సిద్ధంగా ఉంది. టన్నెల్ రెస్క్యూ కార్యకలాపాలు, వైద్య సేవలు, విపత్తు నిర్వహణలో నైపుణ్యం కలిగిన బృందాలను వంపేందుకు సన్నాహాలు చేస్తోంది. అటు చైనా కూడా సహాయక చర్యల్లో భాగస్వామ్యం అవుతోంది. వరదల కారణంగా ధ్వంసమైన రవాణా వ్యవస్థను పునరుద్ధరిం చేందుకు భారత్, చైనాల నుంచి బెయిలీ బ్రిడ్జిలు వంటి అత్యవసర మౌలిక సదుపాయాల సహాయం కోరినట్లు సమాచారం.

### రంగంలో విదేశీ బృందాలు

ఇది ఇలా ఉంటే సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నప్పటికీ.. శిథిలాలు, బురద, కొండచరియలు, తెగిపోయిన రహదారులు రెస్క్యూ బృందాలకు పెను సవాలుగా మారాయి. తొలుత విదేశీ సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాల అవసరం లేదని స్పష్టం చేసిన నేపాల్ ప్రభుత్వం.. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తన నిర్ణయాన్ని సవరించింది. ప్రత్యేక సాంకేతిక నైపుణ్యం అవసరమైన రంగాల్లో అంతర్జాతీయ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. భారత్, చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా నుంచి నిపుణుల బృందాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం కానున్నాయి.

### వరదలో సర్వం కోల్పోయాం.. నేపాల్వాసుల కన్నీరు మున్నీరు

వరద నా సర్వస్వాన్ని కబళించింది.. ఇల్లు లేదు.. కుటుంబ సభ్యుల ఆచూకీ లేదు.. మిగిలింది ప్రాణం ఒక్కటే.. అంటూ నేపాల్ వరద బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలతో అనేక గ్రామాలు పూర్తిగా ధ్వంసమవగా, వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. సైన్యం ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరాల్లో ఆశ్రయం పొందిన బాధితులు తమ ఆప్తుల కోసం ఎదురు చూస్తూ శోకసంద్రంలో మునిగిపోయారు. పలువురు తమ కళ్లముందే ఇళ్లు, కుటుంబ సభ్యులు వరదలో కొట్టుకుపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు కొనసాగిస్తుం డగా, బాధిత ప్రాంతాల్లో ఇంకా విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పాలిటెక్నిక్‌పై పునరాలోచించాలి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 97 పై విద్యార్థుల్లో అపోహలున్నాయని అందువల్ల పాలిటెక్నిక్ విద్యపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్కిల్స్ తో పాలిటెక్నక్ విద్యార్థులకు ఉద్యోగాలు వస్తాయని దేశంలో ఉన్న విధానమే తెలంగాణలోనూ ఉండాలన్నారు. ప్రభుత్వం తెచ్చిన జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యను ఇంజినీరింగ్‌లోనే ఉంచాలని, పాలిటెక్నిక్ ను లేబర్ శాఖకు మార్చొద్దన్నారు.

### విద్యార్థుల ఆందోళనలు:

శక్తి స్కీం పేరుతో పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో తమ భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుందని, జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తుండగా విద్యార్థులకు ప్రతిపక్షాలుసైతం మద్దతుగా నిలిచాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కే.కేశవరావు నేతృత్వంలో హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది.

# మీ పట్టుదల అందరికీ గర్వకారణం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు నగరాల్లో పలు క్రీడల్లో పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. అలానే తమ విజయాలతో దేశానికి పేరు ప్రఖ్యాతులను తీసుకొచ్చిన క్రీడాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. క్రీడాకారులకు, క్రీడాభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు.'ప్రతి క్రీడాకారుడికి.. మీ అంకితభావం, అభిరుచి, పట్టుదల అందరికీ గర్వకారణం. తరతరాలకు స్ఫూర్తినిచ్చే ప్రతిభావంతుడైన దిగ్గజ మేజర్ ధ్యాన్ చంద్‌కు నివాళులర్పిస్తున్నా' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అలాగే టీమిండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలంటే కేవలం గెలవడం మాత్రమే కాదని తాను బలంగా నమ్ముతానని అన్నాడు. క్రీడలు.. కలలు కనడం, కష్టపడటం, ఎదురుదెబ్బలను తట్టుకొని ముందుకు సాగడం నేర్పిస్తాయని పేర్కొన్నాడు. జాతీయ క్రీడాదినోత్సవం నాడు యువతను మరింత ఎక్కువగా ఆటలు ఆడేలా ప్రోత్సహిద్దామని శిఖర్ ధావన్ వెల్లడించాడు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

# ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు..

**న్యూ ఢిల్లీ :** రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మరోసారి తీవ్రంగా నడుస్తోంది. గత నాలుగేళ్ల నుంచి యుద్ధం జరుగుతోంది. ఇప్పటికే వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. ఇరువైపులా ఆస్తులు ధ్వంసమయ్యాయి. తాజాగా మరోసారి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా దాడులు చేసినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఇప్పటివరకు 27 మంది ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు సుమారు 50 నివాస భవనాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దాడుల నేపథ్యంలో కీవ్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సహాయక, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదుర్చేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేకపోయింది. అంతేకాకుండా ట్రంప్ బృందం కూడా ఇరువైపులా చర్చలు కూడా జరిపారు. అయినా ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఇలాంటి తరుణంలో మరోసారి భీకర దాడులు జరుగుతున్నాయి. ఈ యుద్ధానికి ఎప్పుడు ఫుల్‌స్టాప్ పడుతుందో చూడాలి.




# మళ్లీ వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా :** దొరలు పొర్లు దండాలు పెట్టినా తెలంగాణలో మళ్లీ వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో రైతుల చేతులకు బేడీలు వేసిన బీఆర్ఎస్ ఇప్పుడు అదే రైతులపై మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. శనివారం (ఆగస్ట్ 29) సూర్యాపేట జిల్లాలోని నూతన్‌కల్, మద్దిరాల మండలాల్లో సుమారు 3 వేల ఎకరాల భూముల పట్టాలను పేద రైతులకు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా నూతనకల్ మండలంలోని గ్రామపంచాయితీ పల్లె వనం గ్రౌండ్‌లో సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎవరికీ సంక్షేమ పథకాలు అందలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుంటే బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదలే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ధరణి స్థానంలో భూభారతి తెచ్చాక అన్ని సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. పేదలకు ఇళ్లు ఇస్తుంటే తట్టుకోలేక బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ఫైర్ అయ్యారు. ఆర్టీసీ ఆస్తులను ప్రజలకు పంచుతున్నామని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసిన తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక పోర్టల్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కే.కేశవరావు (కేకే) నేతృత్వంలోని కమిటీ ప్రతినిధి బృందం శనివారం డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ పాల్గొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వేదికగా నిర్వహించిన విస్తృత స్థాయి సంప్రదింపుల వివరాలను కమిటీ ముఖ్యమంత్రికి వివరించింది. ఈ సంప్రదింపుల్లో 13 వేల మందికి పైగా తెలంగాణ ఉద్యమకారులతో పాటు వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారులు పాల్గొన్నట్లు కమిటీ తెలిపింది. ఉద్యమకారుల నుంచి సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తులతో పాటు ఉద్యమకారుల వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తిస్తూ వారి సేవలకు తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు కమిటీ వెల్లడించింది. ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన కసరత్తును ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్, పోర్టల్ ఏర్పాటు, డిజిటల్ దరఖాస్తుల స్వీకరణ, జిల్లాల వారీగా సమన్వయం, అవసరమైన పరిపాలనా వనరుల కల్పన వంటి అంశాల్లో కమిటీకి పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.సమావేశంలో సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వి.పి. గౌతమ్, ఎస్. శ్రీధర్, ముఖ్యమంత్రి ఓఎస్డీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లైన 250 గజాల నివాస స్థలాలు, ఆసరా పెన్షన్, ఆరోగ్య కార్డులు, ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం, ఉద్యోగులకు గౌరవ గుర్తింపు తదితర అంశాలను కమిటీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జీవో నెం. 679 ద్వారా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన డిమాండ్లపై సానుకూలంగా స్పందించినందుకు కమిటీ చైర్మన్ కె. కేశవరావు, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మోతె శోభన్‌రెడ్డి, ఎస్. రాములు నాయక్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# గడువు పెంచండి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ గారికి ముఖ్యమంత్రి గారు లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించినట్లు ముఖ్యమంత్రి గారు ఈసీ గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయబడలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు. ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి గారు లేఖలో పేర్కొన్నారు. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని తెలిపారు. నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా ఎలాంటి సహాయం అందించకుండానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా నివాసం మారిన వారి పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదని తెలిపారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని ముఖ్యమంత్రి గారు తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని కోరారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని విజ్ఞప్తి చేశారు. నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి గారు కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వు (జీవో నంబర్ 172) ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ముఖ్యమంత్రి గారు తెలిపారు. మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచించారు. హైదరాబాద్‌లోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున కేవలం కొంతమంది అధికారుల నియామకం సరిపోదని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. ఓటర్ల నమోదు అధికారి సాయికి దిగువన అదనపు అధికారులను నియమించి, ముద్రిత నోటీసుల్లోనే నిర్దిష్ట తేదీలు, సమయాలను పేర్కొంటూ వికేంద్రీకృత విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. సర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు పరిపాలనా, ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

# పిల్లలు భారం కాదు..

**అల్లూరి,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ దిశగా సంజీవని వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కనెక్టివిటీ పెంచేందుకు కూడా మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలు భారం కాదని.. పిల్లలే మన సంపద అని తెలిపారు. ఈరోజు (శనివారం) అల్లూరి జిల్లా అరకులోయ మండలంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. గన్నెలలో సంజీవిని ప్రాజెక్ట్‌ను, ఆరోగ్య రథాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. అల్లూరి జిల్లాలో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించుకుంటున్నామని తెలిపారు.

**'థింసా'తో గిరిజన బిడ్డలు గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సృష్టించారు..**

గతంలోనే ఆయుర్వేద వైద్యాన్ని గిరిజనులకు అల్లూరి సీతారామరాజు అందించారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలాంటి మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకు కొత్తగా నిర్మించిన ఎయిర్ పోర్టుకు అల్లూరి పేరు పెట్టామని వెల్లడించారు. థింసా డాన్స్‌తో గిరిజన బిడ్డలు గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సృష్టించారని ప్రశంసించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందాలని సూచించారు. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహించి ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. కొండ ప్రాంతాల్లోని వారికి వైద్య సేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండకూడదనేది తన సంకల్పమని ఉద్ఘాటించారు. దీని కోసమే సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు.

**తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్ ద్వారా గర్భిణులకు వైద్యసేవలు..**

ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో, చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంజీవని కార్యక్రమం రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని ఉద్ఘాటించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోగుల రక్త నమూనాలను పెద్ద ఆస్పత్రికి డ్రోన్ల ద్వారా తరలించి పరీక్ష చేసి చికిత్స అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్ ద్వారా గర్భిణులకు వైద్యసేవలందించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. 104 వాహనాల ద్వారా సంచార వాహనాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు. గిరిజనులతో పాటు రాష్ట్రంలో ప్రతీ పౌరుడి ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదు..**

గిరిజన ప్రాంతాల్లో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జీఓ నంబర్-3 మేమే తీసుకువచ్చాం. గత పాలకులు నిర్లక్ష్యంతో సుప్రీంకోర్టు దానిని రద్దు చేసింది. ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకువస్తాం. ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు చేశాం. అడవితల్లి బాట పేరుతో రూ.1000 కోట్లతో 900 కిలోమీటర్ల రహదారులు వేశాం. 1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు, సోలార్ రూఫ్ టాప్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెరిగేలా అరకు కాఫీని మరో లక్ష ఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగింది. హోం స్టేల ద్వారా ఆతిథ్యం ఇస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుంది. మన ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో గిరిజన యువత ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**ప్రతి గిరిజన బిడ్డ అందరిలా ఆరోగ్యంగా ఎదగాలి..**

వచ్చే మూడేళ్లలో లక్ష మంది యువతకు నైపుణ్య శిక్షణ కల్పించాలన్నదే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'అత్యవసర వైద్య సేవలను అందించేందుకు జిల్లాలో 150 వాహనాలతో ఎమర్జెన్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్ ఉంది. కొండ ఎంత దూరంలో ఉన్నా... వైద్యం మీ దగ్గరకు రావాలి. మంచి వైద్యం అందాలి. ప్రతి గిరిజన బిడ్డ అందరిలా ఆరోగ్యంగా ఎదగాలి.. అందుకే సంజీవని తీసుకువచ్చాం. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అదే నిజమైన అభివృద్ధి. గిరిజన ప్రాంతాలకు మంచి వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్ తెస్తున్నాం. సికిల్ సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10,000 పెన్షన్ అందిస్తున్నాం. గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలి. అందుకే IIT మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నాం. IIT, NEET వంటి పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నాం. గిరిజన రైతులు తమ ఉత్పత్తితో ప్రపంచ స్థాయి బ్రాండ్ సృష్టించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై సీఎం ఆరా..**

గన్నెల పంచాయతీ ఆర్కే(రామకృష్ణ) నగర్‌లో ప్రజలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై మాటామంతీలో మొత్తం 16 మందితో సీఎం మాట్లాడారు. గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 జనాభా ఉండగా.. ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని.. దానికి గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. మరొక మహిళ తన కుమార్తె నీట్ కోచింగ్‌లో ఉందని తెలుపగా.. శెభాష్ అని సీఎం ప్రశంసించారు. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలను చదివించాలని సూచించారు.

**సీఎం కుశల ప్రశ్నలు..**

'నీకు నీట్ కోసం తెలుసా అమ్మా.. అని సీఎం ఓ తల్లిని అడగ్గా డాక్టర్ కోర్స్ తెలుసు సార్' అని సమాధానం ఇచ్చింది. ఇంకా మిగిలిన మహిళలతో సీఎం మాట్లాడారు. పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు.. ఏం చేయబోతున్నారని కుశల ప్రశ్నలు వేశారు. అందరి యోగక్షేమాల గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడి.. వైద్యపరమైన సేవలు, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

**పథకాలు ఇక్కడి వరకు చేరుతున్నాయా..?**

ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు ఇక్కడి వరకు చేరుతున్నాయా..? అని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ఒకప్పటితో పోలిస్తే ఈ గ్రామంలో జనాభా బాగా తగ్గారని.. ఎందుకని సీఎం అడిగారు. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకొని ఆర్కేనగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు.

# దివ్యాంగులపై దయ లేని ప్రభుత్వం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దివ్యాంగులపై దయ లేని ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వమేనా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు నిలదీశారు. ఎల్ బి నగర్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగుల పెన్షన్ ను రూ.500 నుంచి రూ.4016కు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అలాగే హౌసింగ్ లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ఇచ్చారని, విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమని గుర్తుచేశారు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. సీఎం రేవంత్ దివ్యాంగుల పెన్షన్ ను ఒక్కరూపాయి అయినా పెంచాడా? అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా.. తెలంగాణలో దివ్యాంగుల చట్టాన్ని అద్భుతంగా అమలు చేసి.. భారత్‌లోనే ఉత్తమ రాష్ట్రంగా అవార్డు పొందేలా చేసింది కేసీఆర్ అని కితాబిచ్చారు. దివ్యాంగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని నిలదీస్తుందని హరీష్ రావు హామీ ఇచ్చారు. అలాగే దివ్యాంగులు కోరిన విధంగా కేసీఆర్ తో సంప్రదించి.. బీఆర్ఎస్ పార్టీలో దివ్యాంగుల శాఖను కూడా ఏర్పాటు చేసి.. దివ్యాంగులను పార్టీలో భాగస్వామ్యం చేసుకుంటామన్నారు.

**నీ గురువు చేసింది.. నువ్వెప్పుడు చేస్తావ్ రేవంత్?**


రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే.. చంద్రబాబు తన గురువు, ఏపీ తన ఆదర్శమని అంటాడని.. అలాంటి తన గురువు ఏపీలో దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తున్నాడని, 80 శాతానికి పైగా వైకల్యం ఉన్నవారికి రూ.15 వేలు పెన్షన్ ఇస్తున్నాడని.. మరి ఆయన్ను ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో దివ్యాంగులకు పెన్షన్లను ఎప్పుడు రూ.6 వేలకు పెంచి ఇస్తారని నిలదీశారు. చంద్రబాబు గెలిచిన మొదటి నెల నుంచే దివ్యాంగులకు పెన్షన్లు పెంచారని, నువ్వెప్పుడు ఇస్తావ్ రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. అలాగే.. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. దీనివల్ల ప్రభుత్వంపై పెద్దగా భారం పడేది లేదన్నారు. రూ.6 వేల పెన్షన్ తో పాటు బాకీ పడిన రూ.66 వేలు దివ్యాంగులకు చెల్లించాలని, బ్యాక్ లాగ్ పోస్టుల్ని వెంటనే భర్తీ చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగుల కోసం లోకల్ బాడీ రిజర్వేషన్ అమలు చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## సీఎం రేవంత్‌కు 'రైతు సంక్షేమ కమిషన్' నివేదిక..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థపై వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నివేదిక అందించింది. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక యూనిట్లతో చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. తెలంగాణ వ్యవసాయ - రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి నేతృత్వంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి నివేదిక అందించారు. కమిషన్ సిఫారసులపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. పంటల మార్పిడి, ఉద్యానవన పంటల సాగు పెంపు, ఎఫ్‌పీవోల ఏర్పాటు వంటి అంశాలపై కమిషన్ దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి నివేదికలో కమిషన్ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను కలిపే కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించింది. చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని, చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ సరిహద్దులను తక్షణం గుర్తించి ఆక్రమణలను తొలగించి పరిరక్షించాలని సూచించింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని తెలిపింది. గడిచిన రెండేళ్ల కాలంలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ ప్రతినిధి బృందం వివరించింది. కమిషన్ పనితీరుపై ముఖ్యమంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు.

# డెమోరైల్‌కు హాల్ట్ పెట్టించాలి



**భిక్కనూరు,ఫ్లాష్ ఇండియా :** సికింద్రాబాద్-నిజామాబాద్‌ల మధ్య నడిచే డెమోరైల్‌కు భిక్కనూరు రైల్వేస్టేషన్‌లో హాల్ట్ పెట్టించాలని సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ రిక్వెస్ట్ చేశారు. శనివారం భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో జరిగిన సొసైటీ కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దక్షిణ కాశీగా భాసిల్లుతున్న భిక్కనూరు సిద్ధ రామేశ్వరాలయానికి వచ్చే భక్తులతో పాటు, రైల్వేస్టేషన్ ద్వారా రాకపోకలు సాగించేవారికి ఈ రైలు సౌకర్యంగా ఉంటుందన్నారు.

మీరు అడిగిన డెమోరైల్‌కు హాల్ట్ పెట్టిస్తానని ఎంపీ శెట్కార్ భరోసా ఇచ్చారు.

# సాగర్ ఎడమ కాలువ నుంచి 6,000 క్యూసెక్కుల నీటి విడుదల





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలకు తాగునీరు,రైతులకు సాగునీరు అందించడంతో పాటు చెరువులు,కుంటలను నింపి భూగర్భ జలాలను పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్ట్ గేట్లను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్వయంగా ఎత్తి నీటిని విడుదల చేశారు. పెద్దదేవులపల్లి వద్ద అవుట్‌ఫాల్ రెగ్యులేటర్‌ను ఆన్ చేసి 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తద్వారా నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నిండేలా నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. అదేవిధంగా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని వజీరాబాద్ మేజర్,కిష్టాపురం మేజర్,మల్కల్ కాలువ మేజర్‌తో పాటు తక్కెలపాడు లిఫ్ట్ గేట్లను ఎమ్మెల్యే ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతాంగానికి మేలు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. చెరువులు,కుంటలు, కాలువలను నీటితో నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి, నియోజకవర్గ ప్రజలకు తాగునీటి లభ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు రైతుల పంటలకు అవసరమైన సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి నీటి వనరులను అందుబాటులోకి తీసుకువచ్చి రైతులు,ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. నీటి విడుదల సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని,చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం ఒక పుణ్య కార్యం



**మహబూబ్ నగర్ ,ఫ్లాష్ ఇండియా :** వన మహోత్సవం ఒక పుణ్య కార్యమని, ప్రకృతిని రక్షించడం, చెట్లను నాటడం అనేది మానవాళి మనుగడకు ఎంతో అవసరమని జిల్లా సంక్షేమ అధికారిణి జరినా బేగం అన్నారు. వన మహోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని 'డే కేర్ సెంటర్'లో ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు పచ్చటి ప్రకృతిని అందంగా ఉంచడంతో పాటు, ఆక్సిజన్‌ను విడుదల చేయడం, సమస్త జీవుల మనుగడకు ఎంతో అవసరమని, ప్రతి వ్యక్తి విధిగా మొక్కను నాటి సంరక్షించాలని ఆమె సూచించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ మాట్లాడుతూ చెట్లు వర్షాలు కురిపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని, వన మహోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, ఆ మొక్కను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, రాజసింహుడు, నస్కంటి నాగభూషణం, కోటేశ్వర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, హన్మంతు, ఉమేష్ కుమార్, అబ్దుల్ మన్నాన్, హన్మంత్ రెడ్డి, సూపరింటెండెంట్ వసుంధర, సూపర్వైజర్ రాధ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం




# బ్యాంకింగ్ లోపాలపై అంబుడ్స్‌మన్ అస్త్రం

డిజిటల్ బ్యాంకింగ్ విస్తరణతో ఆర్థిక లావాదేవీలు గతంలో ఎన్నడూ లేనంత సులభంగా మారాయి. ఇంటి నుంచే ఖాతాలు నిర్వహించుకోవడం, క్షణాల్లో నగదు బదిలీ చేయడం, ఆన్‌లైన్‌లో రుణాలు పొందడం వంటి సేవలు ప్రజల జీవితాలను సౌకర్యవంతం చేశాయి. అయితే సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో.. అదే స్థాయిలో సేవా లోపాలు, డిజిటల్ మోసాలు, అనధికార లావాదేవీలు, చెల్లింపుల సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఇలాంటి సందర్భంలో వినియోగదారుడికి తన సమస్యను పరిష్కరించుకునేందుకు అందుబాటులో ఉన్న వ్యవస్థలపై అవగాహన అత్యంత అవసరం.బ్యాంకు లేదా ఆర్థిక సంస్థలో సమస్య ఎదురైనప్పుడు చాలామంది వినియోగదారులు సంబంధిత సంస్థను సంప్రదించినా, సమస్య పరిష్కారం కాకపోతే తర్వాత ఏం చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ వ్యవస్థ వినియోగదారుడికి కీలకమైన ఫిర్యాదు పరిష్కార వేదికగా నిలుస్తోంది. 'వన్ నేషన్, వన్ అంబుడ్స్‌మన్' విధానం ద్వారా వివిధ ఆర్థిక సేవలకు సంబంధించిన ఫిర్యాదులను ఒకే వ్యవస్థ కింద పరిష్కరించే ప్రయత్నం జరుగుతోంది.ముఖ్యంగా 2026లో ప్రతిపాదించిన విధానాల్లో వినియోగదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే మార్పులు కనిపిస్తున్నాయి. సేవా లోపాల కారణంగా వినియోగదారుడు నేరుగా ఎదుర్కొన్న నష్టానికి పరిహారం పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచడం గమనార్హం. అదే విధంగా వినియోగదారుడి సమయం వృథా కావడం, ఎదుర్కొన్న మానసిక ఇబ్బందులకు ఇచ్చే అదనపు పరిహారం పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షలకు పెంచడం కూడా బాధ్యతాయుతమైన సేవలకు ప్రోత్సాహం కల్పించే చర్యగా భావించవచ్చు.అయితే నిబంధనలు రూపొందించడం మాత్రమే సరిపోదు. వాటి గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. ఫిర్యాదు పరిష్కార ప్రక్రియలో కాలపరిమితులు కీలక పాత్ర పోషిస్తాయి. వినియోగదారుడు ముందుగా సంబంధిత బ్యాంకు లేదా ఆర్థిక సంస్థకు అధికారికంగా ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు అందిన తర్వాత సంస్థ 30 రోజుల్లో స్పందించాల్సి ఉంటుంది. సమాధానం రాకపోయినా, వచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేకపోయినా, నిర్దేశిత వ్యవధిలో అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించే అవకాశం ఉంటుంది. సంస్థ నుంచి తుది స్పందన వచ్చిన తర్వాత 90 రోజులలోపు ఫిర్యాదు చేయాలనే నిబంధన నేపథ్యంలో వినియోగదారుడు కాలపరిమితిని నిర్లక్ష్యం చేయకూడదు.ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఉంది. అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఆశ్రయించే ముందు వినియోగదారుడు తన ఫిర్యాదుకు సంబంధించిన ఆధారాలను భద్రపరచుకోవాలి. బ్యాంకు స్టేట్‌మెంట్లు, లావాదేవీ వివరాలు, ఫిర్యాదు నంబర్, ఇమెయిల్స్, సందేశాలు, సంబంధిత స్క్రీన్‌షాట్లు వంటి ఆధారాలు సమస్య పరిష్కారంలో కీలకంగా మారవచ్చు. కేవలం మౌఖికంగా ఫిర్యాదు చేసి వదిలేయకుండా, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి దానికి సంబంధించిన రికార్డును ఉంచుకోవడం ప్రతి ఖాతాదారుడి బాధ్యత.బ్యాంకింగ్ రంగానికే పరిమితం కాకుండా ఆర్‌బీఐ పరిధిలోని అనేక ఆర్థిక సంస్థలు ఈ వ్యవస్థ పరిధిలోకి వస్తాయి. వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సంబంధిత సహకార బ్యాంకులు, అర్హత కలిగిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, డిజిటల్ వాలెట్లు, ప్రీపెయిడ్ పేమెంట్ సాధనాలు, డిజిటల్ పేమెంట్ సేవలు, క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలకు సంబంధించిన కొన్ని ఫిర్యాదులు కూడా ఈ వ్యవస్థ పరిధిలో ఉండవచ్చు. దీంతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో వినియోగదారుడి రక్షణకు ఒక సమగ్ర వ్యవస్థ అవసరమనే విషయాన్ని ఇది స్పష్టం చేస్తోంది.అయితే అంబుడ్స్‌మన్ వ్యవస్థ ఉందన్న నమ్మకంతో వినియోగదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. డిజిటల్ మోసాల విషయంలో ముందస్తు జాగ్రత్తే అసలు రక్షణ. బ్యాంకు సిబ్బంది పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, మోసపూరిత యాప్‌లు, ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, కార్డు వివరాలను అడిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకులు సాధారణంగా ఓటీపీ లేదా పిన్ వంటి రహస్య వివరాలను ఫోన్‌లో అడగవు అనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి.మోసం జరిగిన తర్వాత స్పందించడంలో ఆలస్యం చేయడం కూడా ప్రమాదకరమే. అనధికార లావాదేవీ గుర్తించిన వెంటనే సంబంధిత బ్యాంకు లేదా చెల్లింపు సంస్థకు సమాచారం ఇవ్వడం, అవసరమైన చోట ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా నష్టాన్ని పరిమితం చేసే అవకాశం ఉంటుంది. సమస్య పరిష్కారం కాకపోతే తదుపరి ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను ఉపయోగించాలి.వాస్తవానికి ఆర్థిక వ్యవస్థలో వినియోగదారుడి నమ్మకమే అత్యంత విలువైన ఆస్తి. బ్యాంకింగ్ సేవలు ఎంత ఆధునికంగా మారినా, వాటిలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగవంతమైన ఫిర్యాదు పరిష్కారం లేకపోతే ఆ సాంకేతిక పురోగతి అసంపూర్ణంగానే మిగులుతుంది. అంబుడ్స్‌మన్ వ్యవస్థ పరిహారం అందించే వేదికగానే కాకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ సేవలను మరింత బాధ్యతాయుతంగా నిర్వహించేలా చేసే నియంత్రణ సాధనంగా కూడా పనిచేయాలి.అదే సమయంలో వినియోగదారులు కూడా తమ హక్కులను తెలుసుకోవాలి. ఎక్కడ ఫిర్యాదు చేయాలి? ముందుగా ఎవరిని సంప్రదించాలి? ఎంత వ్యవధిలో స్పందన రావాలి? ఎలాంటి ఆధారాలు భద్రపరచాలి? సమస్య పరిష్కారం కాకపోతే తదుపరి దశ ఏమిటి? వంటి ప్రశ్నలకు సమాధానాలు ప్రతి డిజిటల్ బ్యాంకింగ్ వినియోగదారుడికి తెలిసి ఉండాలి.డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరింత విస్తరించనున్న నేపథ్యంలో వినియోగదారుల రక్షణ వ్యవస్థ కూడా అంతే బలపడాలి. నిబంధనలు ఉండటం ఒక అడుగు అయితే.. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించడం మరో కీలక అడుగు. బ్యాంకింగ్ సేవల్లో సమస్య ఎదురైనప్పుడు మౌనం కాకుండా సరైన విధానంలో ఫిర్యాదు చేయడం వినియోగదారుడి హక్కు. అదే సమయంలో మోసాలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండటం అతని బాధ్యత.

# నిర్లక్ష్యం ఎంతవరకు ఉంది..?

హిమాలయ దేశం నేపాల్ చిరుగుటాకులా వణుకుతోంది. ఆకస్మిక వరద రూపంలో విరుచుకుపడ్డ హిమానీ నదం ఊళ్లకు ఊళ్లనే తుడిచిపెట్టింది. ఇప్పటికే వందల సంఖ్యలో మృతులున్నట్టు లెక్క తేలుతున్నా.. గల్లంతైన వారీ సంఖ్య భారీగా ఉండటంతో.. ప్రాణనష్టం ఇంకా పెరిగే అవకాశం కనిపిస్తోంది. నేపాల్ పెను విషాదంతో.. పర్యావరణ సమతౌల్యంపై మరోసారి చర్చ తెరైపకి వచ్చింది. ప్రకృతికి ఎదురీదితే ఎప్పటికైనా ముప్పు తప్పదనే హెచ్చరికలు వస్తున్నాయి. ప్రస్తుత విషాదం నేపాల్ కే కాకుండా.. టిబెట్, చైనా, భారత్‌కూ ప్రమాద సంకేతమేననే అభిప్రాయాలున్నాయి.హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమానీ నదం బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్టు.. అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో సంభవించిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. ఈ ఆకస్మిక వరదలు 4.4 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా కాదని, హిమానీ నదం కూలిపోవడం వలన సంభవించాయని అమెరికా జియోలాజికల్ సర్వే స్పష్టం చేసింది. తొలుత ఈ ఘటనను 4.4 తీవ్రత గల భూకంపంగా నివేదించినప్పటికీ, విశ్లేషణ అనంతరం భూకంపం సంభవించలేదని నిర్ధారించినట్లు తెలిపింది. సమీపంలోని భూకంప కేంద్రాల సమాచారం, దీర్ఘకాలిక భూకంప తరంగాలు, ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించిన అనంతరం ఈ నిర్ధారణకు వచ్చినట్లు పేర్కొంది. హిమానీ నదం కూలిపోవడం, అనంతరం భారీగా శిథిలాలు దిగువ ప్రాంతాలకు ప్రవహించడం వల్లే ప్రకంపనలు నమోదైనట్లు వివరించింది. బుధవారం టిబెట్‌లో ప్రారంభమైన ఈ ఆకస్మిక వరదలు నేపాల్‌లోని రసువా, ధాడింగ్ జిల్లాల్లో తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. ఈ ఘటనలో పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం జరిగింది. శిథిలాల ప్రవాహం దిగువ ప్రాంతాల్లో భారీ విధ్వంసానికి కారణమైనట్లు తేలింది.భోటెకోషి నది ఉప్పొంగడంతో పలు ప్రాంతాలు నీటమునిగాయి. చిత్వాన్ జిల్లాలో అత్యధిక మరణాలు సంభవించాయి. నేపాల్‌లో కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా నదుల్లో నీటిమట్టాలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని సరిహద్దు ప్రాంతాలపై వరద ప్రభావం ఉండే అవకాశాన్ని కేంద్ర హోంశాఖ నిశితంగా పర్యవేక్షిస్తోంది. అవసరమైన ముందస్తు చర్యలు తీసుకునేందుకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో గల్లంతైన వారి పూర్తి వివరాలు సేకరించడం కష్టంగా మారింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నేపాల్ భద్రతా బలగాలు, విపత్తు నిర్వహణ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. అయితే రహదారులు, వంతెనలు దెబ్బతినడం, కొన్ని ప్రాంతాల్లో సమాచార వ్యవస్థలు పనిచేయకపోవడం వల్ల సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భారీ వరదల నేపథ్యంలో నేపాల్ ప్రభుత్వం అప్రమత్తమై సహాయక చర్యలను వేగవంతం చేసింది. మరోవైపు భారత్ కూడా తన పౌరుల వివరాలను సేకరించి, వారిని సురక్షితంగా తరలించేందుకు నేపాల్ అధికారులతో సమన్వయం చేస్తోంది.నేపాల్-టిబెట్ సరిహద్దు వెంబడి సంభవించిన వరదలు హిమాలయ ప్రాంతం మొత్తాన్ని మరోసారి భయభ్రాంతులకు గురిచేశాయి. మంచు, రాళ్లు, శిథిలాలతో కూడిన భారీ ప్రవాహం నిమిషాల వ్యవధిలోనే నదీ లోయల గుండా దూసుకువచ్చి, ఇళ్లను, రోడ్లను, వంతెనలను ముంచెత్తింది. ఇది ఒక్క రోజుతో ముగిసిపోయే విపత్తు కాదు. ఇప్పుడు అసలైన ఆందోళన నదులు, వాగులలో పేరుకుపోయే చెత్తాచెదారం గురించే. భారీ వర్షాల వల్ల ఈ అడ్డంకి ఏర్పడి తాత్కాలికంగా ఒక సరస్సు ఏర్పడవచ్చు. అకస్మాత్తుగా గండి పడితే నది మళ్లీ ఉధృతంగా ప్రవహించవచ్చు. ప్రస్తుతానికి వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీచేస్తోంది.ఆగస్టు 26న నేపాల్ , టిబెట్ సరిహద్దులోని రసువా ప్రాంతానికి సమీపంలో ఉన్న ఒక లోయలోకి మంచు, రాళ్లతో కూడిన ఒక పెద్ద ముక్క విరిగిపడింది. దీనివల్ల నీరు, మంచు, బురద, పెద్ద బండరాళ్లతో కూడిన ఒక ఉధృత ప్రవాహం ఏర్పడిందని ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వరద భోటే కోషి త్రిశూలి నదుల వైపు కదిలింది. నిపుణులు ఈ వరదను సాధారణ వర్షపాతానికి భిన్నమైనదిగా పరిగణిస్తున్నారు. హిమానీనదాలు విరిగిపోవడం, కొండచరియలు విరిగిపడటం, నదులు తాత్కాలికంగా మూసుకుపోవడం వంటి కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో అరగంటలోనే నదీమట్టాలు తొమ్మిది మీటర్ల మేర పెరిగాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వేగంగా కరుగుతున్న మంచు కారణంగా ఎత్తైన హిమాలయ లోయలు గతంలో కంటే మరింత అస్థిరంగా మారాయి. ఈ విపత్తులో ఇదే అత్యంత భయానకమైన అంశం. నీరు, శిథిలాలు తమకు చాలా దగ్గరగా వచ్చిన తర్వాతే, కింద నివసించే ప్రజలకు కొండ శిఖరంపై ఏం జరుగుతుందో తరచుగా తెలుస్తుంది.ప్రస్తుతం అతిపెద్ద ఆందోళన ఏంటంట.. మరో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. నదిలో పేరుకుపోయే శిథిలాలు, కొండచరియలు విరిగిపడిన తర్వాత రాళ్లు, బురద తరచుగా నది మార్గాన్ని అడ్డుకుంటాయి, దీనివల్ల నీరు నిలిచిపోతుంది. ఈ సహజ ఆనకట్ట బలహీనపడితే, చెప్పుకోదగ్గ వర్షపాతం లేకపోయినా ఆకస్మిక వరదలు సంభవించవచ్చు.నైరుతి రుతుపవన కాలం సెప్టెంబరులోనే ముగిసిపోదు. భారతదేశానికి దాని వార్షిక వర్షపాతంలో సుమారు 80 శాతం జూన్, సెప్టెంబరు మధ్య లభిస్తుంది. పర్వత ప్రాంతాలలో, వాలు ప్రాంతాలు అప్పటికే తడిగా , బలహీనంగా ఉండటం వల్ల, ఒక్క రోజు కురిసే అత్యంత భారీ వర్షం కూడా సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది. భారత వాతావరణ శాఖ ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 2 వరకు వెలువరించిన విస్తృత వాతావరణ సూచన ప్రకారం, పశ్చిమ హిమాలయాలు, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ , ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో పలు రోజుల పాటు వర్షాలు కురుసా-యి. కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో హిమాలయ ప్రాంతం పూర్తిగా సురక్షితం కాదని ఐఎండి రుతుపవనాల అప్‌డేట్ సూచిస్తోంది. ప్రతి నదికి తప్పకుండా వరద వస్తుందని దీని అర్థం కాదు. నది ఇరుకైన లోయ గుండా ప్రవహించే చోట, పర-్వతం ఇప్పటికే పగిలిపోయిన చోట, లేదా శిథిలాలు నీటి మార్గాన్ని అడ్డుకుంటున్న చోట ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. నేపాల్‌లోని అనేక నదులు బీహార్, ఉత్తరప్రదేశ్ మైదానాల్లోకి ప్రవేశిస్తాయి. ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం పెరిగితే, దాని ప్రభావం సరిహద్దుకు ఇటువైపు కూడా కనిపించవచ్చు.ఆగస్టు 26న లెంధే నదిలో భారీగా మంచు, రాళ్లు, బురద కూలిపోవడంతో కేవలం 30 నిమిషాల్లోనే నీటిమట్టం 9 మీటర్ల వరకు పెరిగింది. ఈ వరద ప్రవాహం భోటే కోషి, త్రిశూలి నదుల ద్వారా దిగువ ప్రాంతాలకు వేగంగా చేరింది. దీంతో రసువా, నువాకోట్ జిల్లాల్లోని స్యాబ్రు బేసి, బేత్రావతి వంటి పలు ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సహాయక చర్యల సందర్భంగా తీసిన ఏరియల్ వీడియోలలో గ్రామాలు, మార్కెట్లు పూర్తిగా బురద దిబ్బలుగా మారిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. బహుళ అంతస్తుల భవనాలు, వంతెనలు, రోడ్లు, జల విద్యుత్ కేంద్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నేపాల్ విషాదంలో చనిపోయిన, గల్లంతైన వారి సంగతి పక్కనపెడితే.. ప్రత్యక్షంగా ప్రకృతి ప్రకోపాన్ని చూసిన వారు ఇప్పటికీ తీవ్రంగా భయపడిపోతున్నారు. అసలు ఎలాంటి హెచ్చరిక, ముందస్తు సంకేతం లేకుండా.. హఠాత్తుగా జలప్రవాహం విరుచుకుపడటం.. అది ప్రళయకాలాన్ని తలపించడం.. చాలా మందికి జీవితంలో మర్చిపోలేని చేదుజ్ఞాపకం అంటే అతిశ-యోక్తి కాదు. పేకమేడల్లా కూలిన వంతెనలు, కొట్టుకుపోయిన నాలుగంతస్తుల భవనాల్ని కూడా ప్రత్యక్షంగా చూసిన అనుభవాల్ని మర్చిపోవడం అంత తేలిక కాదు. ఇదిలా ఉండగా.. విపత్తు ఇంకా ముగిసిపోలేదన్న నిపుణుల మాటలు వారిని ఇంకా భయపెడుతున్నాయి. ఇదే సమయంలో రవాణా పునరుద్ధరణ అంత తేలిక కాదనే అంచనాలు.. అక్కడ చిక్కుకున్నవారిలో భయం పెంచుతున్నాయి. ప్రస్తుతానికి ఈ పెను విపత్తు నుంచి అందర్నీ సురక్షితంగా తప్పించడంతో పాటు.. భవిష్యత్తులో మెరుపు వరదలు రాకుండా ఏం చేయాలో.. వస్తే ఎలా కాచుకోవాలో కచ్చితంగా అధ్యయనం చేయాలి. గల్లంతైన వారిలో 100 నుంచి 140 మందికి పైగా భారతీయ పౌరులతో పాటు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, మలేషియాకు చెందిన పర్యాటకులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేపాల్ సైన్యం హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టి, భవనాలపై, శిథిలాల మధ్య చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. సరిహద్దుకు ఇర-ువైపులా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వరద ప్రభావం కారణంగా ఉత్తర భారతదేశంలోని కొన్ని నదీ పరివాహక ప్రాంతాల్లోనూ అధికారులు అప్రవ-ుత్తత ప్రకటించారు.

# 'లవ్ జిహాద్' కోణంపై పోలీసుల ఫోకస్

ప్రేమ, పెళ్లి, మతం ఈ మూడు అంశాలు కలిసినప్పుడు సమాజంలో చర్చ సహజం. అయితే ఇదే సున్నితమైన అంశం రాజకీయ, సామాజిక వాదోపవాదాలకు కేంద్రంగా మారినప్పుడు మరింత బాధ్యత అవసరం. 'లవ్ జిహాద్' పేరుతో మతమార్పిడికి కుట్ర జరుగుతోందనే ఆరోపణలు కొంతకాలంగా దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయి. తాజాగా కాకినాడలో సౌజన్య కుటుంబ విషాదం నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన కొన్ని అంశాలు ఈ చర్చకు మ-రోసారి తెరతీశాయి. అయితే ఆరోపణ ఒకటి రావడం, అది నేరంగా రుజువు కావడం రెండూ ఒకటే కావు. అందుకే ఈ వ్యవహారంలో వాస్తవాలను వెలికితీయడమే అసలు పరీక్ష.సౌజన్య మరణానికి సంబంధించిన కేసు తొలుత ఒక కుటుంబ విషాదంగా కనిపించినప్పటికీ, ఆమె రాసినట్లు చెబుతున్న లేఖలోని కొన్ని అంశాలు వెలుగులోకి రావడంతో వేధింపులు, మతమార్పిడికి ఒత్తిడి వంటి ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఆ కోణాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నిజంగా ఎవరికైనా మతం మా-ర్చుకోవాలని బలవంతం చేశారా? ప్రేమ లేదా వివాహ సంబంధాన్ని మతమార్పిడికి ఉపయోగించారా? లేక వ్యక్తిగత విభేదాలు, కుటుంబ సమస్యలు మరో రూపంలో బయటకు వస్తున్నాయా? అనే ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం లభించాల్సి ఉంది.'లవ్ జిహాద్' అనే పదాన్ని కొందరు మతమార్పిడికి ఉద్దేశపూర్వకంగా నిర్వహించే వ్యవస్థగా వివరిస్తుండగా, మరికొందరు దీనిని నిర్ధారణ లేని ఆరోపణగా అభివర్ణిస్తున్నారు. గతంలో కొన్ని కేసుల్లో మతమార్పిడి, మోసం, బలవంతం వంటి అంశాలు దర్యాప్తులోకి వచ్చినప్పటికీ, ప్రతి అంతర్మత ప్రేమ లేదా వివాహాన్ని ఒకే కోణంలో చూడటం కూడా సమాజానికి ప్రమాదకరమే. ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో చేసుకునే వివాహం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయం. అదే సమయంలో మోసం, బెదిరింపు, బలవంతం లేదా మతం మార్చేందుకు ఒత్తిడి వంటి చర్యలకు చట్టం ముందు ఎలాంటి మినహాయింపూ ఉండకూడదు.ఇక్కడే పోలీసుల బాధ్యత కీలకం. ఆరోపణలు వచ్చిన వెంటనే ఒక నిర్ధారణకు రావడం కాకుండా, ఫోన్ సంభాషణలు, సందేశాలు, ఆర్థిక లావాదేవీలు, సాక్షుల వాంగ్మూలాలు, సంబంధిత పత్రాలు వంటి అన్ని ఆధారాలను పరిశీలించి నిజానిజాలను తేల్చాలి. దర్యాప్తు నిష్పాక్షికంగా సాగితేనే బాధితులకు న్యాయం జరుగుతుంది; నిరాధార ఆరోపణలకు కూడా అడ్డుకట్ట పడుతుంది.మతం పేరుతో జరిగే బలవంతపు మార్పిడులు నిజమైతే అవి కఠినంగా అడ్డుకోవాల్సిందే. అదే సమయంలో 'లవ్ జిహాద్' అనే ముద్రను ప్రతి అంతర్మత సంబంధంపై వేయడం సామాజిక విద్వేషాలకు దారితీసే ప్రమాదం ఉంది. ఒక వ్యక్తి




నేరాన్ని మొత్తం మతానికి ఆపాదించడం న్యాయం కాదు.కాకినాడ ఘటన అందుకే ఒక కేసు మాత్రమే కాదు.. వాస్తవాలు, వ్యక్తిగత స్వేచ్ఛ, మహిళల భద్రత, మత సామరస్యం మధ్య సమతుల్యతను ఎలా కాపాడాలన్న దానికి ఒక పరీక్ష. ఆరోపణలు నిజమైతే దోషులకు శిక్ష పడాలి. నిజం కాకపోతే అనుమానాల పేరుతో సమాజంలో విద్వేషం పెరగకుండా చూడాలి. ప్రేమకు మతం ఉండకపోవచ్చు.. కానీ నేరానికి మాత్రం ఆధారాలు ఉండాలి.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ



**నాగర్ కర్నూల్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు.

**సోమశిలలో మరో ప్రపంచస్థాయి కోర్సు**

కృష్ణానది తీరంలో, నల్లమల అడవులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పర్యాటక క్లస్టర్ సోమశిలలో మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సోమశిలను ప్రత్యేక గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేయడంతో తెలంగాణను గోల్ఫ్ టూరిజం హబ్‌గా మరింత బలోపేతం చేయవచ్చన్నారు. గోల్ఫ్ టూరిజం మౌలిక వసతుల అభివృద్ధిలో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు.తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ సందర్భంగా శనివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (డీపీ వరల్డ్ పీజీటీఐ), హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి ఈవెంట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తోంది.తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదని.. అంతర్జాతీయ గోల్ఫ్‌ను తెలంగాణ పర్యాటక, వారసత్వ సంపదతో అనుసంధానించే వేదిక అని జూపల్లి అన్నారు. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నీ నిర్వహించడం రాష్ట్ర చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కిందన్నారు.హైదరాబాద్ నగరానికే తెలంగాణ పర్యాటకం పరిమితం కాదని.. రాష్ట్రంలోని సరస్సులు, అడవులు, గోదావరి, కృష్ణా నదులు, రాజభవనాలు, కోటలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు.

**కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటాం**

తెలంగాణలో పర్యాటకం, క్రీడల ప్రచారం కోసం కపిల్‌దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని జూపల్లి తెలిపారు. ఆయన అనుభవం, అంతర్జాతీయ గుర్తింపును రాష్ట్ర పర్యాటక, క్రీడా రంగాల ప్రచారానికి ఉపయోగించుకుంటామని చెప్పారు.టోర్నీ నిర్వహణకు సహకరిస్తున్న డీపీ వరల్డ్ పీజీటీఐ, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఇతర భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పన కొనసాగిస్తామని చెప్పారు.

**తెలంగాణ టూరిజం సహకారం అభినందనీయం**

డీపీ వరల్డ్ పీజీటీఐ అధ్యక్షుడు కపిల్‌దేవ్ తెలంగాణ టూరిజం అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ఈ టోర్నీ ద్వారా తెలంగాణ, హైదరాబాద్‌ను ప్రముఖ గోల్ఫ్ టూరిజం గమ్యస్థానాలుగా ప్రచారం చేయవచ్చన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అందిస్తున్న వేదికకు కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రపంచానికి హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ పరిచయం**

హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కెప్టెన్ జస్విందర్ సింగ్ బిర్గి మాట్లాడుతూ.. 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ గోల్ఫర్ల ఆటను హెచ్‌జీఏ సభ్యులు వీక్షించే అవకాశం లభిస్తుందని తెలిపారు. లైవ్ టెలికాస్ట్ ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అవుతుందన్నారు.

**132 మంది గోల్ఫర్లు.. రూ.కోటి ప్రైజ్‌మనీ**

సెప్టెంబరు 1 నుంచి 4 వరకు జరిగే టోర్నీలో 132 మంది గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొననున్నారు. రూ.కోటి ప్రైజ్‌మనీ కోసం పోటీపడనున్నారు. భారత్‌తో పాటు విదేశాలకు చెందిన ప్రముఖ గోల్ఫర్లు పాల్గొంటున్నారు. టోర్నీకి అధికారిక ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్ (ఓడబ్ల్యూజీఆర్) పాయింట్లు లభించనున్నాయి. కార్యక్రమంలో డీపీ వరల్డ్ పీజీటీఐ సీఈఓ అమన్‌దీప్ జోల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన అంతర్జాతీయ గోల్ఫర్ స్టెపాన్ డానెక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పేరుతో భారీ కుంభకోణం..

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి జిల్లా డీసీసీబీ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగు చూసింది. రైతుల నుంచి ఇన్స్ పెక్షన్ చార్జీల పేరిట గత డీసీసీబీ సీఈఓ, చైర్మన్ ఇద్దరు కలిసి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేశారు. ఇన్స్ పెక్షన్ ఛార్జీలు వసూలు చేయాలంటూ గత సీఈఓ శ్రీనివాస్ 2025 జూన్ 16 నుంచి అక్రమంగా ఉమ్మడి జిల్లా రైతుల నుంచి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమంగా ఇన్స్ పెక్షన్ చార్జీలు వసూలు చేయడంపై ఉమ్మడి జిల్లా రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీసీసీబీ సీఈఓగా పనిచేసిన శ్రీనివాస్, ఇంకొందరు అధికారులు కలిసి ఈ వ్యవహారాన్ని చక్క బెట్టినట్లు ఆరోపిస్తున్నారు. కాగా దీనిపై శ్రీనివాస్‌పై విచారణ జరుగుతుండగా ఆయనను నిజామాబాద్‌కు బదిలీ చేశారు. కేవలం ఒక సర్క్యులర్ ద్వారా కోట్ల రూపాయలు వసూలు చేయడంలో అధికారులు కీలకపాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై విచారణ చేపట్టి భాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**ఆర్బీఐ, నాబార్డు గైడ్ లైన్స్ కు విరుద్ధంగా వసూళ్లు..**

రైతుల నుంచి ఇన్ పెక్షన్ చార్జీల పేరిట రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రైతుల నుంచి వసూలు చేయడం ఆర్బీఐ, నాబార్డు గైడ్ లైన్స్ కు విరుద్ధం. ఏ జిల్లాలో కూడా రైతుల నుంచి రుణాల సమయంలో డబ్బులు వసూలు చేయలేదు. కానీ ఉమ్మడి మెదక్ డీసీసీబీ బ్యాంకు నుంచి ప్రత్యేకంగా సర్క్యులర్ జారీ చేసి ఉమ్మడి జిల్లా రైతుల నుంచి సుమారు రూ.8 నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేసి భారీ కుంభకోణానికి తెరలేపారు. మరి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసిన డబ్బులు ఎక్కడికి వెళ్లాయనే విషయంపై విచారణ చేయాల్సిన అవసరం ఉంది. నిబంధనలు కాదని డబ్బులు వసూలు చేసిన చైర్మన్, డీసీసీబీ సీఈఓలపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. కేవలం రైతుల నుంచే కాకుండా ఉద్యోగుల బదిలీల్లోనూ భారీ ఎత్తున వసూళ్లు చేసినట్లు రైతు సంఘాల నాయకులు, ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అయితే వీటిపై రైతు సంఘాల నాయకులు సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ఫిర్యాదులు చేశారు. దీంతో మంత్రి విచారణకు ఆదేశించారు. పూర్తి విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రైతుల నుంచి గైడ్ లైన్స్ కు విరుద్ధంగా వసూలు చేసిన డబ్బులు ఎక్కడి వెళ్లాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఈ డబ్బులను డీసీసీబీ చైర్మన్, గత సీఈఓ ఇద్దరు పంచుకున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై సమగ్రంగా విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

**వివాదాలకు కేరాఫ్‌గా గత సీఈఓ వైఖరి..**

డీసీసీబీ బ్యాంకు గత సీఈఓ వివాదాలకు కేరాఫ్‌గా మారారు. బ్యాంకులో అనేక అక్రమాలు, డబ్బుల దుర్వినియోగం, రుణాల పంపిణీ, ఉద్యోగుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు పలు ఫిర్యాదులు ఉన్నాయి. అంతే కాకుండా ఉమ్మడి మెదక్ డీసీసీబీ బ్యాంకులో నిబంధనలకు విరుద్ధంగా 10 సంవత్సరాలు విధులు నిర్వహించి అనేక అక్రమాలకు పాల్పడినట్లు రైతు సంఘాలు బాహాటంగా ఆరోపిస్తున్నాయి. అంతే కాకుండా బ్యాంకు ఉద్యోగులకు 60 రోజుల వేతనంగా ఎక్స్ గ్రాటీయా పేరుతో చెల్లించి అందులో నుంచి 20 రోజుల వేతనం తక్కువ చెల్లించి సీఈఓ, బ్యాంకు చైర్మన్ వాటాలు తీసుకున్నారని ఆరోపిస్తున్నారు. అదే విధంగా 50 మంది ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై కూడా రైతు సంఘాల నాయకులు రాష్ట్ర సహకార శాఖ మంత్రికి ఫిర్యాదులు చేశారు. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 6 కొత్త బ్రాంచులు ఏర్పాటుతో పాటు మరో 20 బ్రాంచీలలో రెనోవేషన్ పనులు చేసి వారికి ఇష్టమైన కాంట్రాక్టర్లకు ఇచ్చి రూ.లక్షలను బ్యాంకుకు నష్టం చేసినట్లు ఆరోపిస్తున్నారు.

# ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగలేరా?..

**బంజారాహిల్స్,ఫ్లాష్ ఇండియా :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను వచ్చేలోపే ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా నిర్వహించడంపై మండిపడ్డారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపిక కోసం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో లక్కీ డ్రా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే తాను వచ్చే లోపే లక్కీ డ్రా కార్యక్రమం ప్రారంభించడంతో ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారు? మీకు ప్రోటోకాల్ తెలియదా? అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యక్రమం మధ్యలోనే అలిగి వెళ్లిపోయారు.

**సిగ్గుండాలి..**

అధికారులు మర్యాదగా వ్యవహరించాలని మీ ఇష్టం వచ్చినట్లు చేసుకుంటామంటే మరి ఎమ్మెల్యేలం ఉండి ఎందుకు అని దానం ప్రశ్నించారు. అధికారులకు ఎమ్మెల్యే అంటే భయం లేకుండా అయిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లక్కీడ్రాలో ఇండ్లు రాని వారంతా తన వద్దకు రావాలని గల్లా పట్టి అందరికీ ఇండ్లు ఇప్పిస్తానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# చేతులెత్తేసిన సిబ్బంది!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మెట్రో ఆన్ లైన్ సేవల్లో మరోసారి అంతరాయం ఏర్పడింది. శనివారం ఉదయం ఆన్‌లైన్ టికెట్లు తీసుకున్న వాళ్లకు సేవల్లో ఇబ్బందులు తలెత్తాయి. ఆన్ లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులకు స్టేషన్లలో లోపలికి వెళ్లే, బయటకు వచ్చే ఆటోమేటిక్ గేట్ల వద్ద ఉన్న సెన్సార్లు పనిచేయడం మానేశాయి. దీంతో ఆన్‌లైన్ టికెట్లు స్కాన్ కాక ప్రయాణికులు స్టేషన్ గేట్ల వద్దే నిలిచిపోవాల్సి వచ్చింది. పరిస్థితి చక్కదిద్దాల్సిన సిబ్బంది చేతులెత్తేయడంతో సమస్య మరింత తీవ్రమైందనే విమర్శలు వ్యక్తున్నాయి. కార్యాలయాలు, విద్యాసంస్థలకు వెళ్లే వేళ ఈ సమస్య తలెత్తడంతో స్టేషన్ల వద్ద భారీగా క్యూ లైన్లు ఏర్పడ్డాయి. సేవలు నిలిచిపోవడంపై నగరవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# సెప్టెంబర్ 3 నుంచి రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ అధికారికంగా ఖరారు చేసింది. ఆల్ ఇండియా కోటా , డీమ్డ్, కేంద్ర విశ్వవిద్యాలయాల్లోని ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి సంబంధించిన ప్రక్రియ సెప్టెంబర్ 3వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లతో ప్రారంభం కానుంది. అర్హులైన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని, తమ ప్రాధాన్యతలను బట్టి వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ఎంసీసీ స్పష్టం చేసింది.షెడ్యూల్ ప్రకారం.. విద్యార్థులు నమోదు చేసుకున్న ఆప్షన్ల ఆధారంగా సెప్టెంబర్ 9న మొదటి విడత సీట్ల కేటాయింపు ఫలితాలను అధికారులు వెల్లడిస్తారు. ఈ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు సెప్టెంబర్ 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంబంధిత కేటాయించిన వైద్య కళాశాలల్లో రిపోర్ట్ చేసి అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవడానికి అవకాశం కల్పించారు. గడువు ముగిసేలోగా అవసరమైన ధ్రువపత్రాలు, ఫీజు చెల్లింపు వివరాలతో కాలేజీల్లో చేరాలని అధికారులు విద్యార్థులకు సూచించారు.

# అభ్యర్థులకు అలర్ట్.. టెట్ ఎగ్జామ్స్ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ఇన్ సర్వీస్ టీచర్స్ కోసం నిర్వహించే టెట్ 2026 పరీక్షల షెడ్యూల్ ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. సెప్టెంబర్ 8,9 తేదీల్లో 3 షిఫ్టుల్లో టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకూ ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 8వ తేదీన తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో పేపర్ -1, పేపర్ -2, సెప్టెంబర్ 9న మిగతా మీడియంల పేపర్ -2 పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 24,983 మంది అభ్యర్థులు ఇన్ సర్వీస్ టీచర్స్ టెట్ పరీక్షలు రాయనున్నారు. పూర్తి వివరాల కోసం https://school-edu.telangana.gov.in ను విజిట్ చేయాలని సూచించింది.

# పరిష్కారంపై సర్కార్ ఫోకస్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** త్వరలో పీఆర్‌సీని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ముందుగా కమిటీ నుంచి నివేదిక తెప్పించుకుని, సిఫారసులను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అయితే ఫిట్‌మెంట్ ఎంత శాతం ఇవ్వాలి? అనే అంశంపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను అన్ని కోణాల్లో అధ్యయనం చేసిన తర్వాతే ఓ నిర్ణయానికి ప్రభుత్వం రానున్నది. ఈ మధ్య ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ప్రత్యక్ష ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనితో ముందుగా పీఆర్‌సీ నివేదికను తెప్పించుకుని, స్టడీ చేస్తే ఎలా ఉంటుందనే కోణంలో సర్కారు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

**ఆ ఎన్నికల్లోపే పీఆర్‌సీ అమలు**

డిసెంబర్ లోపు కోర్ ఏరియా పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది.ఆ ఎన్నికలు ముగిసిన వెంటనే మార్చిలో రెండు గ్రాడ్యుయేట్ స్థానాలకు (హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, ఖమ్మం-నల్లగొండ-వరంగల్ నియోజకవర్గాలు) ఎన్నికలు జరగనున్నాయి. అటు మున్సిపల్, ఇటు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఎంప్లాయిస్ చాలా కీలకం. పీఆర్‌సీని ప్రకటించకుండా ఎన్నికలకు వెళ్తే క్షేత్ర స్థాయిలో రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకని చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఈ లోపు రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను పూర్తి స్థాయిలో క్లియర్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అందులో భాగంగా వచ్చే నెల నుంచి ప్రతి నెల రూ.1500 కోట్లపైగా క్లియర్ చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్టు తెలిసింది.

**రెడీగా ఉన్న పీఆర్సీ రిపోర్ట్?**

2023 అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లే ముందు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సరిగ్గా వారం రోజులు ముందు (అక్టోబరు 2, 2023న) రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్.శివశంకర్ చైర్మన్, మెంబర్‌గా మరో రిటైర్డ్ ఐఏఎస్ రామయ్యను నియమిస్తూ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసింది. అదే సమయంలో 5 శాతం మధ్యంతర భృతిని సైతం ప్రకటించి, అక్టోబరు నెలతోపాటు అమలు చేసింది. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుసగా రెండేళ్లపాటు ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో పీఆర్‌సీ అంశాన్ని పెండింగ్‌లో పెట్టింది.అయితే ఈ మధ్య పీఆర్‌సీ అమలు చేయాలని ఉద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వస్తుండటంతో కమిటీ సిఫార్సులపై ప్రభుత్వం ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఫిట్‌మెంట్ ఎంత మేరకు ఇవ్వాలనే అంశంపై ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి అభిప్రాయాలు సేకరించింది. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి కూడా సమాచారాన్ని ఆరా తీసి, నివేదికను రెడీ చేసినట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం అడిగిన వెంటనే ఇచ్చేందుకు కావాల్సిన కసరత్తు పూర్తి చేసినట్టు సమాచారం.

**భారీ ఫిట్‌మెంట్ కోసం ఆశలు**

రాష్ట్రం ఏర్పడిన తరువాత 2015లో 43% ఫిట్‌మెంట్‌ను అమలు చేశారు. తెలంగాణలో తొలిసారి పీఆర్‌సీ కమిటీ 7.5% ఫిట్‌మెంట్‌కే సిఫారసు చేసినప్పటికీ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకంగా 30% ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది. దీనితో రేవంత్ సర్కారు సైతం పెద్ద ఎత్తున ఫిట్‌మెంట్‌ను ఇస్తుందొచ్చని ఆశలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉన్నారు. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అందుకు సానుకూలంగాలేదని చర్చ అధికార వర్గాల్లో ఉంది. ఎందుకంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఫిట్‌మెంట్ పెద్దగా ఉండకపోవచ్చనే చర్చ అధికార వర్గాల్లో ఉంది.ఇప్పటికే 5% మధ్యంతర భృతిని అమలు చేస్తున్నారు. పెండింగ్‌లో ఆరు డీఏలు ఉన్నాయి. ఆ డీఏలను అన్నింటినీ ఫిట్‌మెంట్‌లో మెర్జ్ చేసి పీఆర్‌సీని ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. అయితే ఉద్యోగులను నిరాశ పరచకుండా వెంటనే మూడవ పీఆర్సీ ఏర్పాటు చేసి, అసెంబ్లీ ఎన్నికల లోపు (2028 డిసెంబరు) నివేదిక ఇచ్చే విధంగా డెడ్‌లైన్ పెట్టాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తుందని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి వెల్లడించారు.

# నేపాల్‌కు మరో వరద ముప్పు..



**ఖాఠ్మాండూ,ఫ్లాష్ ఇండియా :** నేపాల్‌ను వరద ముప్పు మరోసారి భయపెడుతోంది. నాలుగు రోజుల కిందట సంభవించిన భారీ ఆకస్మిక వరదల విషాదం నుంచి కోలుకోకముందే మరో ప్రమాదం పొంచి ఉందని చైనా హెచ్చరించింది. లెండే ఖోలా నదీ వ్యవస్థ ఎగువ ప్రాంతంలో హిమనీనదం కూలిపోవడంతో కొండచరియలు, శిథిలాలు అడ్డుకట్టగా తాత్కాలిక సరస్సు ఏర్పడిందని చైనా అధికారులు తెలిపారు. ఈ సరస్సులో నీటి రంగు క్రమంగా ముదురుతోందని.. ఇది అడ్డుకట్ట బలహీనపడుతున్న సంకేతం కావచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు నేపాల్ విదేశాంగ శాఖకు చైనా అధికారులు సమాచారం అందించారు.చోచెన్ నది, పురేపు నదుల సంగమ ప్రాంతానికి సమీపంలో ఏర్పడిన ఈ సరస్సులో శుక్రవారం నాటికి సుమారు 25 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరినట్లు చైనా జలవనరుల శాఖ తెలిపింది. మరో మూడు రోజుల్లో అదనంగా 30 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు నీరు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. అయితే, తాత్కాలిక అడ్డుకట్టలో కొంత భాగం తెగిపోతే గరిష్ఠంగా సెకనుకు 500 క్యూబిక్ మీటర్ల నీరు దిగువకు ప్రవహించే అవకాశం ఉందని చైనా వరద నమూనా అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ ప్రవాహం నదీ గట్ల పరిధికే పరిమితమవుతుందని, దిగువ ప్రాంతాల్లో నీటి మట్టం స్వల్పంగా పెరగవచ్చని అధికారులు తెలిపారు. భారీ స్థాయిలో నీటి ఉధృతి ఉండే అవకాశం తక్కువగా ఉందని పేర్కొన్నారు.మరోవైపు, శుక్రవారం నుంచే సరస్సు లీకై లెండే ఖోలా, త్రిశూలీ నదుల్లోకి నీరు ప్రవహించడం ప్రారంభమైంది. ఇప్పటికైతే ఈ ప్రవాహంతో తక్షణ ప్రమాదం లేదని చైనా ప్రభుత్వ మీడియా వెల్లడించింది. అయితే అడ్డుకట్ట పూర్తిగా లేదా పాక్షికంగా తెగిపోయే ప్రమాదాన్ని కొట్టిపారేయలేమని అధికారులు చెబుతున్నారు. దీంతో సరస్సు పరిస్థితిని డ్రోన్లు, ఉపగ్రహాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. బుధవారం సంభవించిన ఆకస్మిక వరదలతో నేపాల్, టిబెట్‌లో భారీ నష్టం నేపథ్యంలో తాజా హెచ్చరిక ఆందోళనకు గురిచేస్తోంది.

# మహిళా క్రికెటర్లకు ఉజ్వల భవిష్యత్తు

## నల్లగొండలో మహిళా క్రికెట్ ఓపెన్ సెలక్షన్స్



**ఫ్లాష్ ఇండియా,మిర్యాలగూడ ప్రతినిధి:** హైదరాబాద్-నల్లగొండ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో శనివారం మహిళా క్రికెట్ ఓపెన్ సెలక్షన్స్ ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 70 మంది మహిళా క్రీడాకారిణులు ఈ సెలక్షన్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఇండియన్ క్రికెటర్ స-ునీత ఆనంద్,జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అమీనుద్దీన్ మాట్లాడుతూ.. మహిళల్లో క్రికెట్ క్రీడను ప్రోత్సహించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి ఓపెన్ సెలక్షన్స్ ఎంతగానో దోహదపడతాయని అన్నారు. రానున్న రోజుల్లో మహిళా క్రీడాకారిణులకు క్రికెట్ రంగంలో మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారిణులను గుర్తించి,వారికి మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిభావంతులను ఎంపిక చేసి హైదరాబాద్ ఉమెన్స్ క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించడంతో పాటు,భవిష్యత్తులో ప్రీమియర్ లీగ్,భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. మహిళా క్రికెటర్ల కోసం ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రిటైర్డ్ చీఫ్ జస్టిస్ సింగిల్ మెంబర్ కమిటీ పి. నవీన్ రావుకు,ఉమెన్ క్రికెట్ ఆర్గనైజేషన్ కమిటీ,జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అమీనుద్దీన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నా మరియా, క్రికెట్ అడ్మిన్ ఫణీంద్ర,బి.శ్రావణి,కోచ్‌లు బుచ్చిబాబు,షఫీయొద్దీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరణ



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** శనివారం, తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ రూపొందించిన 2026--27 విద్యా సంవత్సర అకడమిక్ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారి సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అకడమిక్ క్యాలెండర్‌ను కేవలం తేదీల పట్టికగా కాకుండా పాఠశాల విద్యా ప్రణాళికకు మార్గదర్శకంగా ఉపయోగించుకోవాలని సూచించారు. అందులో పేర్కొన్న కార్యక్రమాలను నిర్ణీత గడువుల్లో సమ-ర్థవంతంగా అమలు చేసి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలోని ప్రతి పాఠశాలకు అకడమిక్ క్యాలెండర్ చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో నిర్వహించాల్సిన విద్యా, సహ పాఠ్య, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణలను ముందుగానే ప్రణాళికాబద్ధంగా అమలు చేసేందుకు ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్లు వివరించారు. ప్రతి నెలకు సంబంధించిన పని దినాలు, సెలవులు, పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశాలు, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (FA) పరీక్షల షెడ్యూల్, మూల్యాంకనాలు, రికార్డుల నిర్వహణ గడువులు, జిల్లా, జాతీయ స్థాయి క్రీడలు, ప్రదర్శనలు, ప్రా-జెక్టు పోటీలు, తదితర వివరాలను ఇందులో పొందుపరిచారన్నారు. సెప్టెంబర్ నెల క్యాలెండర్‌లో 23 పని దినాలు, పా-ఠశాల నిర్వహణ కమిటీ సమావేశం, జిల్లా స్థాయి క్రీడా పోటీలు, FA-2 పరీక్షల కాలపరిమితి, FA-2, సమగ్ర రికార్డుల పూర్తి తేదీలు, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల గడువు, జాతీయ స్థాయి ప్రదర్శనలు, ప్రా-జెక్టు పోటీల వివరాలను స్పష్టంగా పేర్కొన్నారన్నారు. విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించేందుకు ప్రతిరోజూ 30 నిమిషాల రీడింగ్ యాక్టివిటీ, మానసిక ప్రశాంతత, ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతిరోజూ యోగా, ధ్యానం నిర్వహించేలా క్యాలెండర్‌లో ప్రత్యేకంగా ప్రాధాన్యం కల్పించారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న పంట ధ్వంసం చేసిన దుండగులు..

**మోమిన్‌పేట్,ఫ్లాష్ ఇండియా :**



వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని సైదలీపూర్ గ్రామంలో రైతు ఉద్దాల యేసయ్యకు చెందిన ఎకరం మొక్కజొన్న పంటను గుర్తుతెలియని వ్యక్తులు కొడవళ్లతో పూర్తిగా కోసి ధ్వంసం చేశారు. పంట చేతికొచ్చే సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో రైతు కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. పొలానికి వెళ్లిన యేసయ్య పంట మొత్తం నేలకొరిగి ఉండటాన్ని చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఏఈఓ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రైతు కష్టపడి సాగు చేసిన పంటను ఇలా ధ్వంసం చేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టంతో తీవ్రంగా నష్టపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కుటుంబం కోరుతోంది.



# 22-A జాబితా నుంచి ప్రైవేట్ ఆస్తుల తొలగింపుకు హామీ

**మేడ్చల్,ఫ్లాష్ ఇండియా :** యు ఎల్ సి, 22Aనిషేధిత జాబితాలో నమోదైన నిజమైన ప్రైవేట్ ఆస్తులను తొలగించేందుకు రెండు రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి స్పష్టమైన హామీ ఇచ్చారు అని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ కాలనీల ఆర్డబ్ల్యూఏ బాధ్యులు, ఆస్తి యజమానులు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. సీతారాం నగర్ (సర్వే నం. 109, 111), ఆదర్శ్ నగర్, కాకతీయ నగర్, డిఫెన్స్ కాలనీ, ఆర్.కె.పురం ఆఫీసర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని లింక్ డాక్యుమెంట్లతో కూడిన వినతిపత్రాలు అందజేశారు.

**బోర్‌వెల్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని..**

ధృవీకరణ పత్రాలు సమర్పించిన సర్వే నంబర్లను పరిశీలించి, చట్టబద్ధమైన హక్కులున్న ఆస్తులను 22-A నుంచి మినహాయిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు అని, ఆస్తి యజమానుల హక్కుల పరిరక్షణకు, సమస్య శాశ్వత పరిష్కారానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అలాగే, నేరేడ్మెట్‌లోని రజక సేవా సంఘం స్థలంలో వాషింగ్ వర్క్‌షెడ్, బోర్‌వెల్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బి.టి. శ్రీనివాసన్, రాఘవేంద్రరావు, అచ్యుత్ రావు, గోపాల్ రెడ్డి, మోహన్ కుమార్, రఘుదేవ్, మహాపాత్ర, రఫీక్, నరేష్, రాము యాదవ్, డోలి రమేష్, శ్రీధర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శోభన్ బాబు, శివ యాదవ్, రమేష్, చిందం శ్రీనివాస్, జె.కె. సాయి, రామకృష్ణ, కపిల్ రావు, ఈశ్వరరావు, అనిల్ రెడ్డి, శ్రీనివాస్, రజక సంఘం సభ్యులు కృష్ణ, కిషన్, శంకర్, రాములు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# సన్న వడ్ల నమోదు ప్రక్రియ తప్పనిసరి

**సుల్తానాబాద్,ఫ్లాష్ ఇండియా :** సుల్తానాబాద్ మండలంలో సన్న రకం వడ్ల బోనస్ పొందేందుకు రైతులు విత్తన కొనుగోలు పత్రాలను స్థానిక ఏఈఓ వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పైడితల్లి తెలిపారు. అధికారిక డీలర్లు లేదా సొంత సీడ్ ప్లాంట్ల రశీదులను సెప్టెంబర్ 10వ తేదీ లోపు సమర్పించాలని అన్నారు. వానాకాలం పండించిన పంట ప్రభుత్వ విక్రయ కేంద్రంలో విక్రయించుటకు, గ్రామ వాలంటీర్ ద్వారా పంట నమోదు ప్రక్రియ తప్పనిసరి అని, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం దక్కేలా అధికారులు పని చేస్తున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం గడువులోగా వివరాలు సమర్పించాలని స్పష్టం చేశారు. సాగు విస్తీర్ణం, రకం వివరాలను కచ్చితంగా నమోదు చేసినప్పుడే ధాన్యం విక్రయాల సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తవని ఏవో స్పష్టం చేశారు.

# రేషన్ షాపులలో నాసిరకం బియ్యం పంపిణీ...

## అధికారుల పర్యవేక్షణ లోపం...పేద ప్రజలకు శాపం





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** రేషన్ షాపులలో నాసిరకం బియ్యం పంపిణీ చేస్తున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మిర్యాలగూడ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయంలో మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అందరికీ సన్న బియ్యం ఇవ్వాలని సంకల్పంతో ప్రజలు మొత్తం అందరూ వండుకొని తినాలని ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన రేషన్ సన్న బియ్యం దళారీల ద్వారా కల్తీ జరుగుతుందని ఆరోపించారు. బియ్యం ఎక్కడి నుండి వస్తున్నాయో తెలియదనీ బియ్యాన్ని రైస్ మిల్లుల ద్వారా ఎఫ్సిఐ గోదాములకు లేదా సివిల్ సప్లై గోడౌన్లకు మిల్లుల ద్వారా వస్తుంటాయి. ఈ బియ్యాన్ని క్వాలిటీ ఇన్స్పెక్టర్లు సెలెక్ట్ చేసి బియ్యాని పాస్ చేసి తర్వాతనే గోడౌన్లోకి దిగుమతి చేస్తారు. మరి ఈ బియ్యం అధికారులు వారి స్వార్థాలకు మరిగి నాసిరకం బియ్యాన్ని పాస్ చేసి గోడౌన్లో దిగుమతి చేస్తున్నారు. ఆ బియ్యం రేషన్ షాపులకు మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఉన్న రేషన్ బియ్యం కాంట్రాక్ట్ లారీల ద్వారా అన్ని రేషన్ షాపులకు తరలిస్తారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో యాదగిరి పల్లి గ్రామంలో ఒక డీలర్ షాప్ ని పరిశీలించగా 20 బస్తాల వరకు శీల్ మిషన్ కుట్టుతో కాకుండా పురి కోసతో కుట్టిన బస్తాలు దిగుమతి అయినవి,ఆ బస్తాలలో బియ్యం దుమ్ము ధూళి తో పాటు పురుగులు ఉన్నాయి. కింద పడిన బియ్యాన్ని ఊడ్చి బస్తాలోకి పోసినట్టుగా ఉన్నట్లు సిపిఐ పార్టీ అభిప్రా-యపడుతున్నదనీ అని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం ప్రజలందరికీ అందించాలని ఉద్దేశంతో ప్రవేశపెట్టిన బియ్యాన్ని ప్రజలకు తెలిసే విధంగా మంత్రులు,ఎమ్మెల్యేలు, అధికారులు అందరూ కలిసి ప్రజలు తినాలని సామూహిక ఇష్టబంతులు పెట్టి ప్రజాప్రతినిధులు అధికారులు అందరూ పాల్గొని సహబంతి భోజనం చేసినారని,మరి ఇవ్వాల ఈ రేషన్ షాపుకు వచ్చినటువంటి బియ్యాన్ని తింటే ప్రజలు అనారోగ్యాలు హా-స్పటల్ పాలు కావడమే తప్ప మరొకటి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పింది ఒకటి ప్రభుత్వ అధికారులు చేసేది ఒకటి అని ఈ బియ్యాన్ని ఏం చేస్తారో వారి ఆలోచించాలని వారు అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ,ప్రభుత్వ అధికారులు రేషన్ షాపులకు మంచి బియ్యాన్ని పంపించి పూర్తిస్థాయిలో పరిశీలన చేసి పంపియాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అంజన్నపెల్లి రామలింగం,గువ్వల మట్టయ్య,ఎస్కే షమీం,ఎస్కే రహీం,డి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# యువత క్రీడా స్ఫూర్తితో దేశానికి కీర్తి తీసుకురావాలి





**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** యువత క్రీడా స్ఫూర్తితో దేశానికి కీర్తి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ 121వ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరై, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మేజర్ ధ్యాన్ చంద్ భారత క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మహనీయుడని అన్నారు. బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన క్రమశిక్షణ, అంకితభావం, కఠోర శ్రమతో ప్రపంచ హాకీ చరిత్రలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ జీవిత ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మేజర్ ధ్యాన్ చంద్ నాయకత్వంలో భారత హాకీ జట్టు 1928లో ఆమ్‌స్టర్‌డామ్, 1932లో లాస్ ఏంజెల్స్, 1936లో బెర్లిన్ ఒలింపిక్స్‌లలో వరుసగా మూడు స్వర్ణ పతకాలు సాధించి, ప్రపంచ వేదికపై భారత జెండాను రెపరెపలాడించిందని కలెక్టర్ గుర్తు చేశా-రు. అసాధారణ నైపుణ్యం, బంతిపై అద్భుత నియంత్రణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆయనను "విజార్డ్ ఆఫ్ హాకీ"గా గౌరవించారని తెలిపారు. క్రీడలు కేవలం పతకాల కోసమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాల పెంపొందింపుకు, క్రమశిక్షణకు, జట్టు భావనకు పునాది వేస్తాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, అకడమిక్స్‌తో పాటు క్రీడల్లో రాణించడం ద్వారానే సమగ్ర వ్యక్తిత్వం అభివృద్ధి చెందుతుందని సూచించారు. పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమ ఉంటే ఏ రంగంలోనైనా అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని మేజర్ ధ్యాన్ చంద్ జీవితం మనకు నేర్పుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం ఒక క్రీడ (లేదా) శారీరక వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇది ఎంతో అవసరమన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అవలంబిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, అధికారులు, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. తదనంతరం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని అథ్లెటిక్స్ విభాగంలో 100, 400, 800 మీటర్ల పరుగులు, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలతో పాటు బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించగా, ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పతకాలు, జ్ఞాపికలను ప్రదానం చేసి, అభినందించారు. అదే విధంగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు గాను వారు క్రీడా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎన్. ఎల్. నరసింహారావు, అధికారులు, యు-వజనులు, క్రీడాకారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వీపనగండ్ల మండల ప్రజా సమస్యల పై సమీక్ష సమావేశం



**ఉమ్మడి మహబూబ్ నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వీపనగండ్ల మండల ప్రజా ప్రతినిధులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మరియు ప్రజలకు సూచన తేది:31/08/2026 (సోమవారం)ఉదయం 10 గంటల నుంచి గౌరవ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు గారువీపనగండ్ల మండల కేంద్రం లో మండల ప్రజా సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో గ్రామ,మండల, డివిజన్ మరియు జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటున్నారు,కావున మండల ప్రజలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలపై, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న పెండింగ్ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. వివిధ సమస్యలు ఉన్న ప్రజలు తమ సమస్యలను దరఖాస్తు రూపకంలో రాసి, మంత్రి గారి కార్యాలయానికి దరఖాస్తుపై మీ సొంత సెల్ ఫోన్ నెంబర్ రాసి వెంటనే, మేము తెలియచేస్తున్న సెల్ ఫోన్ 8185885127 కు వాట్సప్ చేయగలరని కోరుతున్నాం. మీరు పంపిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుంది. మంత్రి జూపల్లి కృష్ణా రావు గారికి మీయొక్క సమస్యలను పేపర్ పై రాసి మీ సొంత ఫోన్ నెంబర్ను రాసి, దరఖాస్తులను ఇవ్వండి. కనపర్చిన వాట్సాప్ నెంబర్ కు దరఖాస్తును పంపండి





# వ్యతిరేకించే ముందు తెలుసుకోండి...

క్రికెట్‌లోకి తిరిగి రావడానికి సిద్ధవ-ఎవుతున్న అనయా బంగర్.. దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ మారిజానే కాప్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించింది. మహిళల క్రికెట్‌లోకి అనయాకు తిరిగి వచ్చే అవకాశం కల్పించడంపై కాప్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. క్రికెట్ ఆస్ట్రేలియా తీసుకున్న నిర్ణయాన్ని కాప్ 'పూర్తిగా హాస్యాస్పదం' అంటూ విమర్శించింది. తాజాగా ఆమె వ్యాఖ్యలపై అనయా బంగర్ స్పందిస్తూ.. ఈ అంశంపై వ్యతిరేకంగా మాట్లాడేవారు ముందుగా పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించింది. మారిజానే కాప్ వ్యాఖ్యల గురించి అనయా బంగర్ స్పష్టంగా స్పందించింది. తనకు అనుచిత ప్రయోజనం ఏమీ లేదని, క్రికెట్ ఆస్ట్రేలియా నిర్దేశించిన మార్గదర్శకాలను తాను పాటిస్తున్నానని తెలిపింది. ఈ అంశంపై విమర్శలు చేసే వారు ముందుగా సంబంధిత విషయాలను పూర్తిగా అర్థం చేసుకోవాలని అనయా పేర్కొంది. తన అర్హతకు సంబంధించిన అవసరమైన సమాచారాన్ని ఇప్పటికే అందుబాటులో ఉంచానని, అయినప్పటికీ ఎవరికైనా వ్యక్తిగత అభిప్రాయం భిన్నంగా ఉంటే.. ఈ అంశంపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించింది. క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతి లభించడంతో అనయా బంగర్‌కు క్రికెట్‌లోకి తిరిగి వచ్చే మార్గం సుగమమైంది. అయితే దీనిని నేరుగా ప్రొఫెషనల్ జట్టులో చోటు దక్కినట్లు భావించకూడదు. ప్రస్తుతం ఆమె ఆస్ట్రేలియాలోని ఏదైనా రాష్ట్రం లేదా టెరిటరీలో ప్రీమియర్ క్రికెట్ ఆడేందుకు అర్హత పొందింది. ఇప్పటికే కొన్ని స్థానిక క్లబ్‌లతో అనయా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. త్వరలో తనకు సరైన జట్టును ఎంపిక చేసుకుని క్లబ్ క్రికెట్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. భవిష్యత్తులో ఉమెన్స్ బిగ్ బ్యాష్ లీగ్ (డబ్ల్యుబీబీఎల్)లో ఆడటమే తన ప్రధాన లక్ష్యమని అనయా వెల్లడించింది. అయితే డబ్ల్యుబీబీఎల్ లో చోటు దక్కాలంటే ముందుగా క్లబ్ క్రికెట్‌లో మంచి ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఫిట్‌నెస్‌ను తిరిగి సాధించడంతో పాటు తన ఆటతో సెలెక్టర్లను ఆకట్టుకోవాల్సి ఉంటుంది. క్రికెట్ ఆస్ట్రేలియా తీసుకున్న నిర్ణయం సాధార-ణమైన లేదా అనధికారిక ప్రక్రియ కాదని అనయా స్పష్టం చేసింది. తన కేసులో బోర్డు అనేక అంశాలను పరిశీలించినట్లు తెలిపింది. తన మెడికల్, సర్జికల్ హిస్టరీ, హార్మోన్, టెస్టోస్టెరాన్ రిపోర్టులు, క్రికెట్ నేపథ్యం, మ్యాచ్ ఫుటేజ్ వంటి వివరాలను పరిశీలించినట్లు పేర్కొంది. అలాగే మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్‌కు సంబంధించిన శాస్త్రీయ, అథ్లెటిక్ పనితీరు సమాచారాన్ని కూడా పరిశీలనలోకి తీసుకున్నట్లు వెల్లడించింది. జూలైలో నిర్వహించిన తన తాజా రక్త పరీక్షలో మొ-త్తం టెస్టోస్టెరాన్ స్థాయి 0.6 నానోమోల్/లీటర్ గా నమోదైనట్లు అనయా తెలిపింది. అనయా బంగర్ ఎలైట్ క్రికెట్‌లోకి తిరిగి రావడానికి సంబంధించిన అర్హత మార్చి 2027 నుంచి అమల్లోకి రానున్న విధాన నిబంధనలపై ఆధారపడి ఉంటుంది. అప్పటివరకు ఆమె కమ్యూనిటీ లేదా ప్రీమియర్ క్రికెట్‌లో కొనసాగవచ్చు. అందువల్ల క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతిని డబ్ల్యుబీబీఎల్ కాంట్రాక్ట్ లేదా జాతీయ/ప్రొఫెషనల్ జట్టులో ఎంపికగా భావించలేము. ముందుగా ఫిట్‌నెస్‌ను తిరిగి సాధించి, క్లబ్ క్రికెట్‌లో రాణించి, ఆ తర్వాత ఉన్నత స్థాయి ఎంపిక కోసం తనను తాను నిరూపించుకోవాల్సి ఉంటుంది. మరోవైపు తన ప్రయాణం గురించి కూడా అనయా బంగర్ కీలక వ్యాఖ్యలు చేసింది. చాలా కాలం పాటు తాను 'సర్వైవల్ మోడ్'లో ఉన్నానని తెలిపింది. గతంలో ఎదురైన పరిణామాలను ఇప్పుడు నెమ్మదిగా అర్థం చేసుకుంటూ, తన జీవితాన్ని తిరిగి సర్దుబాటు చేసుకునే దశలో ఉన్నానని పేర్కొంది. తన ముందున్న ప్రయాణాన్ని చిన్న చిన్న అడుగులతో ప్రారంభించనున్నట్లు అనయా తెలిపింది.

# నా పేరు లేదని తెలిసి నవ్వొచ్చింది...



టీమిండియాకు టీ20 ప్రపంచ కప్ అందించిన ముగ్గురు కెప్టెన్లలో సూర్యకుమార్ యాదవ్ ఒకడు. ఈ ఏడాది స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచం కప్‌లో భారత్‌ను విజేతగా నిలిపాడు. ఎంతటి క్లిష్టపరిస్థితి-నైనా తన చిరునవ్వుతోనే మేనేజ్ చేసే కెప్టెన్‌గా సూర్య గుర్తింపు పొందాడు. కెప్టెన్‌గా సూర్య సక్సెస్ అవుతున్నప్పటికీ బ్యాటర్‌గా విఫలం అయ్యాడు. ఈ కారణంతో బీసీసీఐ సూర్యను తప్పించి శ్రే-యస్ అయ్యర్‌కు జట్టు పగ్గాలను అప్పగించింది. దాదాపు రెండు నెలల గడిచిన తర్వాత.. తాజాగా కెప్టెన్సీ మార్పుపై సూర్యకుమార్ స్పందించాడు. ఒలింపిక్స్‌తోపాటు వచ్చే టీ20 ప్రపంచ కప్‌లోనూ జట్టును నడిపిస్తానని తాను తొలుత అనుకున్నట్లు వెల్లడించాడు. భారత మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించాడు. 'ఆ రోజు జట్టు కెప్టెన్‌గా నా పేరు లేకపోవడం చూసి నవ్వొచ్చింది. నవ్వాను. నేను దేశం తరఫున ఆడుతున్న సమయంలో ఎప్పుడైనా తీవ్రమైన ఒత్తిడి ఉందనిపించినా, పరిస్థితులు నా చేయి దాటిపోతున్నాయని అనిపిస్తున్నా, అప్పుడూ ఇలాగే నవ్వు వస్తుంది. ముందుగా నేను రిలాక్స్ అవుతాను. గతంలో నాకు వచ్చిన అవకాశాలు, వాటిని సద్వినియోగం చేసుకున్న తీరును గుర్తు చేసుకుంటాను. తద్వారా ఒత్తిడిని జయించి విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాను. నాకు వచ్చిన ప్రతి అవకాశానికి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటాను. కెప్టెన్సీ నుంచి తప్పించినప్పుడు కూడా ఇలాగే ఆలోచించాను' అని సూర్య పేర్కొన్నాడు. '2026లో కప్ గెలిచిన తర్వాత.. మరో రెండేళ్లు ఈ జట్టుకు నేనే సారథిగా ఉంటానని అనుకున్నా. రాబోయే ఒలింపిక్స్‌లోనూ కెప్టెన్‌గా ఉంటానని భావించా. అయితే, ఇతరుల ఆలోచనలు వీటికి పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. వారి నిర్ణయాలను మనం గౌరవించాలి. ఈ జట్టు మరొకరి సారథ్యంలో రాణిస్తే మంచిదే కదా. శ్రేయస్ అయ్యర్‌ను ఎందుకు సారథిని చేశారని ఎప్పుడూ అనుకోను. కానీ, కెప్టెన్సీ నుంచి తప్పించినప్పుడు నాకు కాస్త బాధ కలిగింది. రెండేళ్లలో ఒక్క సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ప్రపంచ కప్ 2026, ఆసియా కప్‌లనూ గెలిచాం. అంతా బాగున్నప్పుడు నన్ను ఎందుకు తప్పించారో అర్థం కాలేదు. ఇదే ప్రశ్న నా మనసులో తిరుగుతూ ఉండేది. దాదాపు నెలన్నరపాటు ఇంటికే పరిమితమయ్యాను' అని సూర్య కుమార్ యాదవ్ తెలిపాడు.

# టీ20 క్రికెట్‌లో పెను సంచలనం..



టీ20 క్రికెట్‌లో గతేడాది అక్టోబర్‌లో నమీబియా.. సౌతాఫ్రికాను ఓడించి పెను సంచలనం సృష్టించింది. ఆ పసికూన జట్టు మరోసారి అదే సంచలనాన్ని పునరావృతం చేసింది. 10 నెలల వ్యవధిలోనే మళ్లీ సౌతాఫ్రికాను చిత్తు చేసింది. ట్రై సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో నమీబియా 18 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. ఆ జట్టులో జాన్ ఫ్రైలింక్(60) హాఫ్ సెంచరీ బాదాడు. మరో ఓపెనర్ లారెన్ స్టీన్‌కాంప్(41) కూడా రాణించాడు. ఆ జట్టులో వీరిద్దరు మాత్రమే సత్తాచాటగా.. కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్(19) సహా మిగతా వాళ్లు సౌతాఫ్రికా బౌలింగ్ ముందు నిలువలేకపోయారు. అనంతరం బంతితో పసికూన జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. చేజింగ్‌లో దక్షిణాఫ్రికాను నిలువరించింది. నమీబియా బౌలర్లు రూబెన్ ట్రంపెల్మాన్, జేజే స్మిత్ చెరో 3 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పనిపెట్టారు. సౌతాఫ్రికా జట్టులో డెవాల్డ్ బ్రెవిస్(75) ఒక్కడే పోరాడాడు. మిగతా వారిలో నలుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమవ్వగా.. ముగ్గురు పరుగుల ఖాతా కూడా తెరవలేదు. ఒకవైపు వికెట్లు పడుతున్నా బ్రెవిస్ మాత్రం జట్టును గెలిపించడానికి చెమటోడ్చాడు. కానీ, అతని పోరాటం ఫలించలేదు. చివరికి 18వ ఓవర్‌లో ట్రంపెల్మాన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. డువాన్ జాన్సెన్(25 నాటౌట్) ఆఖరి వరకూ నిలిచినా ఎలాంటి అద్భుతం చేయలేకపోయాడు. ఆఖరి ఓవర్‌లో దక్షిణాఫ్రికా విజయానికి 28 రన్స్ అవసరమవ్వగా.. జేజే స్మిత్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. రెండు వికెట్లు తీయడంతోపాటు 9 రన్సే ఇవ్వడంతో నమీబియా మరో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది.

# బిజినెస్

# భారీగా తగ్గిన పసిడి ధరలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు వరుసగా రెండో రోజూ భారీగా పతనమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతో దేశీయంగానూ పసిడి, వెండి ధరలు గణనీయంగా దిగివచ్చాయి. దీంతో నగరంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.2,890 తగ్గి రూ.1,58,240 వద్ద ట్రేడవుతోంది. అదే విధంగా ఆభరణాల తయారీకి వినియోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2,650 క్షీణించి రూ.1,45,050కి చేరింది. వరుసగా రెండు రోజుల పాటు ధరలు భారీగా పడిపోవడంతో కొనుగోలుదారులకు, వినియోగదారులకు కాస్త ఊరట లభించినట్లయింది. బంగారంతో పాటే వెండి ధరలు కూడా భారీ పతనాన్ని నమోదు చేశాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర ఏకంగా రూ.5,000 తగ్గి రూ.2,60,000కు చేరుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాలు, ప్రాంతీయ మార్కెట్లను బట్టి ఈ ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశముందని వర్తక వర్గాలు తెలిపాయి. కాగా, మార్కెట్‌లో నమోదైన ఈ తాజా రేట్లకు అదనంగా 3 శాతం జీఎస్టీ , సంబంధిత తయారీ ఛార్జీలు వర్తిస్తాయని వ్యాపారులు స్పష్టం చేశారు. పండుగల సీజన్‌కు ముందు ధరలు దిగిరావడం మార్కెట్లో కొనుగోళ్ల జోరుకు దారితీస్తుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

# ప్రపంచ ప్రణాళిక అవసరం



ఏఐ విస్తరణపై మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మానవ చరిత్రలోనే అత్యంత విప్లవాత్మకమైన సాధనంగా మారవచ్చని లేదా ఇప్పటికే ఉన్న సామాజిక, ఆర్థిక అసమానతలను మరింత తీవ్రతరం చేసే అతిపెద్ద ప్రమాదంగా పరిణమించవచ్చని బిల్ గేట్స్ హెచ్చరించారు. అనేక రంగాలలో మానవ మేధస్సును మించి ఏఐ వేగంగా వృద్ధి చెందుతున్నప్పటికీ, ఈ మార్పును ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాల ప్రభుత్వాలు, సంస్థలు సిద్ధంగా లేవని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ సృష్టించే మంచి కొద్దిమంది సంపన్నులకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందేలా చూడటానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తక్షణ నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. మునుపటి సాంకేతిక విప్లవాల లాగా కాకుండా, ఈ ఏఐ మార్పు కేవలం ఒక్క దశాబ్ద కాలంలోనే జరిగిపోతుందని, ఇది న్యాయ, వైద్య, కస్టమర్ సర్వీస్, సాఫ్ట్‌వేర్ రంగాల్లోని వైట్-కాలర్ ఉద్యోగాలతో పాటు బ్లూ-కాలర్ ఉద్యోగాలకూ ముప్పుగా పరిణమిస్తుందని గేట్స్ అంచనా వేశారు. పని ప్రదేశాలలో ఉపాధి నష్టాన్ని తగ్గించడంపై ఇప్పటినుంచే ప్రణాళికలు రచించాల్సిన అవసరం ఉందన్నారు.

**పన్ను ప్రతిపాదనలు**

ఈ ప్రమాదాలు ఉన్నప్పటికీ, ఆరోగ్య రక్షణ, వ్యవసాయం, విద్యా రంగాల్లో వైద్యులకు, రైతులకు, ఉపాధ్యాయులకు సహాయంగా మారే అద్భుత సామర్థ్యం ఏఐకి ఉందని గేట్స్ గుర్తుచేశారు. ఈ సాంకేతికత అందించే ప్రయోజనాలను సమాజానికి అనుకూలంగా మలచుకోవడానికి కొన్ని రకాల బాధ్యతలను కేవలం మానవులకే పరిమితం చేసే 'హ్యూమన్ రిజర్వ్డ్' విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు. కంపెనీలు వాడే ఏఐ టోకెన్లు, రోబోట్లపై పన్ను విధించాలని, ఏఐ ద్వారా వచ్చే అదనపు ఆదాయంపై పన్నులు పెంచాలని ఆయన సూచించారు. వచ్చే నిధులతో ఉద్యోగాలు కోల్పోయే కార్మికులకు పునఃశిక్షణ ఇప్పించి, బలమైన సామాజిక భద్రతా వలయాన్ని నిర్మించాలని ప్రపంచ దేశాలకు రోడ్‌మ్యాప్ ఇచ్చారు.

# భారీగా పెరిగిన సీఎన్‌జీ ధర




పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తత పరిస్థితులు భారతదేశంలోని సామాన్యులకు షాకుల మీద షాకులు ఇస్తున్నాయి. తాజాగా దేశ రాజధాని ఢిల్లీలో వాహనదారులపై మరోసారి ఇంధన భారం పడింది. ఢిల్లీ, దాని పరిసర నగరాల్లో సీఎన్‌జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) ధర కిలోకు రూ.3.89 చొప్పున పెరిగింది. సీఎన్‌జీ ధర పెరగబోతోందని ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ శుక్రవారం రాత్రి ప్రకటించగా పెరిగిన ధర ఇవాళ (శనివారం) ఉదయం నుంచి అమల్లోకి వచ్చింది. తాజా పెంపుతో ఢిల్లీలో సీఎన్‌జీ ధర ప్రస్తుతం కిలో రూ.83.09 ఉండగా, అది రూ.86.98కి చేరుతుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ధరలు భారీగా పెరగడమే ఈ పెంపునకు కారణమని అధికారులు చెబుతున్నారు.

**వాహనదారుల ఆవేదన:**

ఇంధన ధరల పెంపుపై స్థానిక క్యాబ్ డ్రైవ-ర్లు, ప్రైవేటు వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారానికి, పది రోజులకు ఒకసారి సైలెంట్‌గా ధరలు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజా పెంపుపై ఓ డ్రైవర్ మాట్లాడుతూ.. ఇంధన ధరలు పెరుగుతున్నాయి కానీ ప్రయాణికుల చార్జీలు పెరగడంలేదని దాంతో అదనపు భారం తమ మీదే పడుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. నిత్యావసర ధరలతో పాటు రవాణా వ్యయం కూడా పెరిగిపోతుండటంతో సామాన్యుడిపై జీవన వ్యయం తీవ్రంగా ప్రభావం చూపుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# రూపాయి క్షీణించడంపై ఆందోళన వద్దు

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన ఢిల్లీలో మీడియాలో మాట్లాడుతూ.. ప్రస్తుతం రూపాయి విలువలో కనిపిస్తున్న క్షీణతతో ఆందోళ చెందాల్సిన పరిస్థితి ఎంతమాత్రం కాదని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, విదేశీ పెట్టుబడుల ప్రవాహంలో మార్పులు, గ్లోబల్ మార్కెట్ ప్రతికూలతల వల్లే రూపాయిపై తాత్కాలిక ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రస-్తుతం భారతదేశ విదేశీ మారక నిల్వలు అత్యంత బలంగా ఉన్నాయని, రూపాయిలో తీవ్రమైన హెచ్చుతగ్గులు రాకుండా అదుపు చేసే సామర్థ్యం ఆర్‌బీఐకి ఉందని స్పష్టం చేశారు. స్వల్పకాలిక హెచ్చుతగ్గులను చూసి భయపడాల్సిన అవసరం లేదని, భారత ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాలు స్థిరంగానే ఉన్నాయని రఘురామ్ రాజన్ తెలిపారు.



## 'టాక్సిక్' పై నయనతార ఆసక్తికర కామెంట్స్

లేడీ సూపర్ స్టార్ నయనతార నటించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'టాక్సిక్'. కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటించిన ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేక తీవ్ర నిరాశ పరిచింది. ఈ సినిమా పరాజయం కావడంపై సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్న నేపథ్యంలో, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నయనతార 'టాక్సిక్' ఫ్లాప్‌పై స్పందిస్తూ.. "ఒక సినిమాను ఎలా తీస్తారు అనే దానిపై ఇండస్ట్రీలో ఉండే అనుభవం మనకు ఒక ప్రాథమిక అవగాహనను ఇస్తుంది. కానీ సినిమా అనేది ఎంతో భావోద్వేగభరితమైనది, అలాగే ఊహించని మలుపులతో కూడుకున్నది. నా కెరీర్‌లో నేను ఎన్నో ఆశలు పెట్టుకుని, ఖచ్చితంగా పెద్ద హిట్ అవుతాయని నమ్మిన కొన్ని సినిమాలు నేను ఆశించినంత విజయం సాధించలేకపోయాయి.అదే సమ-యంలో, కొన్ని చిత్రాల ఫలితంపై నాకే సందేహాలు ఉండేవి, కానీ అవి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాయి" అని తెలిపారు. ఇక ఈ అనుభవాల నుంచి తాను నేర్చుకున్న పాఠం గురించి చెబుతూ.. "చిత్ర పరిశ్రమలో సంవత్సరాల తరబడి సాగిన నా అనుభవం నాకు ఒక ముఖ్యమైన విషయాన్ని నేర్పింది. ఒక సినిమా విజయాన్ని అయినా, లేదా అపజయాన్ని అయినా సరే.. రెండింటినీ ఒకే విధమైన సమచిత్తతతో, వినయంతో స్వీకరించడం నేను నేర్చుకున్నాను" అని నయనతార స్పష్టం చేశారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న 'టాక్సిక్' చిత్రం డిజాస్టర్ అయినప్పటికీ, ఓటమిని అంతే హుందాగా స్వీకరించిన లేడీ సూపర్ స్టార్ మైండ్ సెట్‌ను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.




## క్లారిటీ ఇచ్చిన దర్శకుడు

వరుస హిట్లు కొడుతూ నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా తన ప్రత్యేక ముద్ర వేసుకున్న కోలీవుడ్ స్టార్ ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'ఓమ్'. రీసెంట్‌గా 'అమ-రన్'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ బిగ్ ప్రాజెక్ట్‌లో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తుండగా, గ్లామర్ అండ్ పర్ఫార్మెన్స్ క్వీన్స్ సాయి పల్లవి, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను రైటాక్ స్టూడియోస్, వండర్‌బార్ ఫిలిమ్స్ బ్యానర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న గ్రాండ్‌గా రిలీజ్ కావాల్సి ఉంది.కానీ గత కొద్దిరోజులుగా ఈ మూవీ పోస్ట్‌పోన్ అయిందంటూ వార్తలు రావడంతో, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి ఈ విషయంపై ఓపెన్‌గా మాట్లాడారు. 'ఓమ్' మూవీ రిలీజ్ వాయిదా పడటం నిజమేనని ఆయన తెలిపారు. సినిమా నిర్మాణ పనుల్లో ఆలస్యం కావడం, మెయిన్ యాక్టర్ల కాల్ షీట్స్ అడ్జస్ట్ కాకపోవడం మరియు కొన్ని లొకేషన్ల షూటింగ్ అనుమతులు రావడం లేట్ అవ్వడమే ఈ డీల కి అసలు కారణమని చెప్పారు. అంతేకాకుండా అదే టైమ్‌కి మరికొన్ని పెద్ద సినిమాలు రిలీజ్‌కు క్యూ కట్టడంతో అనుకున్నన్ని థియేటర్లు దొరికే అవకాశం లేకుండా పోయిందని, అందుకే సరైన డేట్ చూసి రిలీజ్ చేయాలని నిర్మాతలు భావించారని ఆయన క్లారిటీ ఇచ్చారు. త్వరలోనే సరికొత్త రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తామన్నారు.

## రవితేజ ఊచకోత..




మాస్ మహారాజా రవితేజ, టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తాజా చిత్రం 'ఇరుముడి' థియేటర్లలో కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్ సొంతం చేసుకున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. తాజాగా చిత్ర బృందం పంచుకున్న అధికారిక పోస్టర్ ఆధారంగా, ఈ సినిమా తొలి వారంలోనే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 135 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులు క్రియేట్ చేసింది. ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటూ 'హార్ట్ విన్నింగ్ బ్లాక్‌బస్టర్'గా ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతోంది.సరికొత్త పోస్టర్‌లో రవితేజ లుంగీ కట్టుకుని, ఆరుబయట తలపై నుంచి బిందెతో నీళ్లు పోసుకుంటూ స్నానం చేస్తున్న లుక్ సినిమాలోని నేటివిటీని, ఆయన క్యారెక్టరైజేషన్ డెప్త్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద తన మాస్ స్టామినా ఏంటో 'ఇరుముడి'తో రవితేజ మరోసారి నిరూపించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ ఏమాత్రం ఖర్చుకు వెనుకాడకుండా ఈ సినిమాను తెరకెక్కించారు. దర్శకుడు శివ నిర్వాణ టేకింగ్, విలక్షణమైన కథాంశానికి తోడు మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన అద్భుతమైన సంగీతం ఈ చిత్ర ఘనవిజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. మున్ముందు రోజుల్లో ఈ సినిమా ఇంకెన్ని బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొడుతుందో చూడాలి.

## ఆ స్టార్ సంస్థ చేతికి




నివిన్ పాలీ, మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీష్ ఏడీ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ మూవీ కొన్ని రోజుల క్రితమే మలయాళంలో విడుదలై కేవలం 6 రోజుల్లోనే రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాను సెప్టెంబర్ 4న తెలుగులో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెండు తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను మైత్రి మూవీ మేకర్స్ సంస్థ దక్కించుకుంది. మైత్రి సంస్థకు రెండు తెలుగు రాష్ట్రాల్లో గట్టి పట్టు ఉండటంతో ఈ మూవీకి పెద్ద స్థాయిలో థియేటర్లు దక్కే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మలయాళంలో వచ్చిన మాదిరిగానే తెలుగులో కూడా ఈ సినిమాకు బ్లాక్‌బస్టర్ టాక్ వస్తే మంచి కలెక్షన్లు రాబట్టడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. మరి ఈ మూవీ తెలుగు బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## ఆ హీరో కంటే నాకే ఎక్కువ అర్హత..


"ఒక సినిమాలో మేల్ స్టార్ కు (హీరోకు) ఒక ఫిక్స్‌డ్ రేట్ తో రెమ్యునరేషన్ లాక్ చేశారు. ఆ హీరోకి ఎంత ఇస్తున్నారో నాకు తెలిసింది. నా వర్క్ ఎక్స్ పీరియన్స్ పరంగా, నేను చేసిన సినిమాల సంఖ్య పరంగా చూసుకుంటే, ఆ హీరో కంటే నేనే ఎక్కువ సక్సెస్ ఫుల్ అని నాకనిపించింది. కాబట్టి నాకు కూడా అదే స్థాయి రెమ్యునరేషన్ కావాలని నేను డిమాండ్ చేశాను" అని దీపికా చెప్పారు.దీపికా తన రెమ్యునరేషన్ గురించి మాట్లాడినప్పుడు నిర్మాతల స్పందన వేరుగా ఉందని ఆమె తెలిపారు. "మా దగ్గర అంత బడ్జెట్ లేదు, సినిమాకి హీరో అవసరం, కాబట్టి మేం అతనికి అంత ఇస్తున్నాం.. నీకు ఇవ్వగలిగింది ఇంతే" అని వాళ్లు చెప్పడంతో.. "సరే, మీకో దండం.. నాకైతే ఇంట్రెస్ట్ లేదు" అని ఆ సినిమాను వదిలేసినట్లు ఆమె కుండబద్దలు కొట్టారు. ఆ సినిమా పేరేంటని ఇంటర్వ్యూయర్ అడిగినప్పటికీ, ఆమె నవ్వుతూ దాన్ని దాటేశారు. మహిళలు తమ పారితోషికం గురించి అడగడానికి ఎందుకు వెనుకాడుతున్నారనే ప్రశ్నకు ఆమె సూటిగా సమాధానం ఇచ్చారు. "మన రెమ్యునరేషన్ కోసం పట్టుబడితే ఎక్కడ మంచి అవకాశాలు కోల్పోతామో అన్న భయం మహిళల్లో ఎక్కువగా ఉంటుంది. ఆ భయం వల్లే చాలా మంది అడగలేకపోతున్నారు. కానీ ఎప్పుడో ఒకప్పుడు, ఎవరో ఒకరు ధైర్యంగా ముందుకు వచ్చి దీని గురించి ప్రశ్నించాల్సిందే" అని దీపికా పదుకొనే స్పష్టం చేశారు. అయితే దీపిక పాన్ ఇండియా మూవీ స్పిరిట్ నుంచి తప్పుకున్నారని, లేదు తప్పించారని రకరకాల వాదనలు ఉన్నాయి. మరి ఆమె దాని గురించే మాట్లాడారా? లేక మరేదైనా సినిమానా? అనేది తెలియాల్సి ఉంది.




## తెలుగు హక్కులు సొంతం




దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఐ యామ్ గేమ్'. 'ఆర్‌డిఎక్స్' ఫేమ్ నహాస్ హిదాయత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమాను సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సినిమాను మొదటి నుంచే తెలుగులో కూడా పెద్ద ఎత్తున విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ చిత్రానికి సంబంధించిన రెండు తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థకు విక్రయించారు. ఈ సంస్థకు తెలుగు రాష్ట్రాల్లో గట్టిపట్టు ఉండటంతో ఈ మూవీకి పెద్ద ఎత్తున థియేటర్లు దొరికే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో కయాదు లోహర్ హీరోయిన్‌గా కనిపించనుండగా.. ఆంటోనీ వర్గీస్ పెపే, మిస్కిన్, కతిర్, సంయుక్త విశ్వనాథన్, వినయ్ ఫోర్ట్, జయసుధ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జేక్స్ బెజోయ్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్ తన సొంత నిర్మాణ సంస్థ 'వేఫేరర్ ఫిల్మ్స్' బ్యానర్‌పై జోమ్ వర్గీస్‌తో కలిసి నిర్మించారు.




## సీడెడ్, ఉత్తరాంధ్ర హక్కులకు భారీ ధర

నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ చిత్రంలో కాయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా థియేట్రికల్ హక్కులను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం 'ది ప్యారడైజ్' చిత్రానికి సంబంధించిన సీడెడ్ హక్కులు రూ.10 కోట్లకు, ఉత్తరాంధ్ర హక్కులు రూ.9 కోట్లకు అమ్ముడైనట్లు తెలుస్తోంది. ప్రముఖ సంస్థలు ఈ రెండు ప్రాంతాల థియేట్రికల్ హక్కులను కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ క్రేజీ మూవీలో మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**